డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ, మత్స్యకార
మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి - 01 సంచిక - 10 ఏప్రియల్, 2021 పేజీలు - 44 వెల : రు. 25/-



# ఆర్.బి.కె. ఛానల్ ప్రారంభోత్సవ దృశ్యాలు




వర్చ్యువల్ విధానంలో ఆర్.బి.కె. ఛానల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు












ప్రధాన సంపాదకులు
**శ్రీ హెచ్. అరుణ్‌కుమార్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ కమీషనర్



సంపాదకులు
**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ

అదనపు సంపాదకులు
**శ్రీ వి. శ్రీధర్**
సంయుక్త వ్యవసాయ సంచాలకులు, (ఆర్.బి.కే.)

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** డిడిఎ ఇన్‌చార్జ్
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె.వి.జి.కె. వరప్రసాద్,** ఎఒ



*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com


## విషయసూచిక


సంపాదకీయం

1. రైతుల సేవే లక్ష్యం 5
2. గ్రామ స్థాయిలో విత్తన ఉత్పత్తి, పంపిణీ 6
3. రబీలో ఈ-క్రాప్ బుకింగ్ మార్గదర్శకాలు 8
4. రైతులకు రూ. 1.13 లక్షల కోట్ల పంట రుణాలు 9
5. ఆర్బీకేలకు 'స్కోచ్ గోల్డ్' అవార్డు 9
6. వ్యవసాయంలో నేల ఉదజని సూచిక ప్రాముఖ్యత 10
7. రసాయన పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు 12
8. మేలైన విత్తనాల సరఫరాలో రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ 14
9. వేసవి పంటగా పెసర సాగు 16
10. రైతు స్థాయిలో మొలక శాతం తెలుసుకునే పద్ధతులు 18
11. వేసవిలో నిమ్మ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు 20
12. వేసవిలో సిరుల పంట - మల్లె 22
13. పెరటి కోళ్ళ పెంపకం 24
14. పశువులకు ఎండ దెబ్బ నివారణ జాగ్రత్తలు 26
15. వన్నమయి రొయ్యల పెంపకంలో చెరువుల తయారీ, రొయ్య పిల్లల ఎంపిక 28
16. మన ఆరోగ్యానికి ఆకుకూరలు 30
17. వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం 32
18. డ్రమ్ము సీడరుతో వరి సాగులో అధిక దిగుబడి 33
19. శనగకు ప్రత్యామ్నాయంగా లాభదాయకంగా జొన్న సాగు 34
20. టూకీగా... 35
21. సందేహాలు - సమాధానాలు 37
22. సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు 39
23. సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు 41
24. సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన 42



డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా - రూ.300/-
పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




సంపాదకీయం

# రైతు విత్తనం రైతుకే...

## అందరికీ అన్నం పెట్టే రైతు మోములో ఆనందం చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయం

*-శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు, ముఖ్యమంత్రి వర్యులు.*

అన్నదాతల సంక్షేమానికి అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి రాష్ట్రంలో రైతుల ఆదరాభిమానం చూరగొంటున్న ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు రానున్న ఖరీఫ్ కాలానికి రైతులు విత్తనాలకు దుకాణాలు, ప్రైవేట్ వ్యక్తుల వద్దకు వెళ్లకుండా ఒక వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిలో రైతు పండించిన విత్తనం రైతుకే చేరుతుంది. దీని వల్ల ఆరుగాలం శ్రమించి, పండించిన రైతు తన ఉత్పత్తి అమ్ముకోవడానికి వ్యాపారులు, దళారులు, మార్కెట్ల వెంట పరుగెత్తాల్సిన పని లేదు. ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారి ముద్దుబిడ్డ అయిన రైతు భరోసా కేంద్రాలు ఇందుకురైతులకువెన్నుదన్నుగా నిలుస్తాయి. రాష్ట్రంలోని 10,778 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన వరి, వేరుసెనగ, కందులు, మినుములు, పెసలు వంటివి మార్కెట్ ధర కన్నా ఎక్కువధరకురైతు నుంచి కొనుగోలు చేసి, వాటిని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ప్రాసెసింగ్ చేసి రైతు తన ఖరీఫ్ పనులు మొదలు పెట్టే సమయానికి రైతుకు అందించాలన్నది ముఖ్యమంత్రి వర్యుల ఆదేశం. ఈ మేరకు రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతు పండించిన పంట అమ్ముకోవడానికి పడిగాపులు పడాల్సి వచ్చేది. అంతేకాదు మార్కెట్లో దళారులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మకై తాము చెప్పిందే ధర, వేసిందే తూకం అన్నట్లు వ్యవహరించేవారు. ఫలితంగా రైతు మోసపోయేవాడు. చివరకు సబ్సిడీ విత్తన సరఫరాకు ప్రభుత్వం కూడా ఈ వ్యాపారుల మీదనే ఆధారపడడం వలన వాళ్ళు టెండర్లు వేసిన ధరకే కొని పంపిణీ చేయాల్సిన పరిస్థితి. ఫలితంగా ప్రభుత్వానికి ఖర్చు ఎక్కువే కాకుండా రైతులు కూడా అధిక ధరకు కొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తన సుదీర్ఘ పాదయాత్రలో ఈ కష్టాలన్నీ స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వర్యులు రైతు విత్తనం.. రైతుకే అన్న వినూత్న ఆలోచనకు కార్యరూపం ఇచ్చారు.

గతంలో విత్తన విక్రయాల్లో దళారులు, ప్రైవేటు కంపెనీలు భారీగా లాభపడేవి. విత్తనం కొన్న రైతుకు ఎటువంటి భరోసా దక్కేది కాదు. అధిక ధరకు కొన్న రైతు తీరా విత్తనం వేశాక, అది మొలకెత్తకపోతే ఎవర్ని అడగాలో తెలియక నెత్తి నోరు కొట్టుకునే పరిస్థితి. రైతులు విత్తనం కొనాలంటేనే అధిక ధర వ్యయం చేయాల్సొచ్చేది.

ఈ కార్యాచరణలో భాగంగానే రైతు భరోసా కేంద్రాలు తమ పరిధిలోని గ్రామాల్లో రైతుల వద్ద నుంచి సేకరించిన విత్తనాలు అక్కడే శుద్ధిచేసి నిల్వ ఉంచుతాయి.కావలసిన రైతులు అడిగిన 48 నుంచి 72 గంటల్లోగా విత్తనం వారికి అందుతుంది. దీనివల్ల పండించిన రైతు వ్యయ ప్రయాసలకోర్చి తన దిగుబడిని ఎక్కడెక్కడికో తీసుకెళ్లి వ్యాపారులు, దళారుల కోసం పడిగాపులు పడాల్సిన పనిలేదు. దళారులు చెప్పిన ధరకు అమ్ముకుని నష్టపోవడం తూకాల్లోను మోసాలకు తావుండదు. తన కల్లం వద్దే గిట్టుబాటు ధరకు అమ్ముకుని తన కష్టార్జితాన్ని ఆనందంగా పొందవచ్చు. ఇదే లక్ష్యంగా ముఖ్యమంత్రి వర్యులు రైతు విత్తనం రైతుకే అన్న వినూత్న విధానం ప్రవేశపెట్టి రైతులకు మేలు చేయ సంకల్పించారు. ఈ విధానం దేశంలోనే తొలిసారి అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. విత్తనం పొందే రైతు కూడా తనకు నచ్చిన నాణ్యమైన విత్తనం పొంది ధీమాగా పంట పండించుకోవచ్చు.

# రైతుల సేవే లక్ష్యం



రైతును ఊరు దాటించే పరిస్థితి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత రైతు భరోసా కేంద్రాలకు (ఆర్బీకేలకు) ఉందని, ఆ మేరకు అవసరమయ్యే సేవలన్నింటినీ అందించాలని సీఎం శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. రైతుల అవసరాలు అన్నింటినీ తీర్చడమే లక్ష్యంగా ఆర్బీకేలు పని చేయాలని, వీటి ద్వారా రైతులు ఆర్డర్ చేసిన వెంటనే నిర్దేశిత సమయంలోగా విత్తనాలు, ఎరువులు చేరాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రస్తుత రబీ పంటల సేకరణతో పాటు, ఖరీఫ్ 2021-22 సన్నద్ధతపై ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు ఊరు దాటి పోకూడని విధంగా సేవలందించాలనే విషయాన్ని అధికారులు కచ్చితంగా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ప్రతి గ్రామానికి ఆర్బీకే యూనిట్‌గా పంటల ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఆర్బీకేల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. ఈ సమయంలో వ్యవసాయ సిబ్బంది ఆర్బీకేలోనే రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్బీకేల ద్వారా కచ్చితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందివ్వాలని, ఇందులో వేరే మాటకు తావులేదని ఫిషరీస్ ఫీడ్, లైవ్ స్టాక్ మెడిసిన్, సీడ్, ఫెర్టిలైజర్ అన్నీ రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## ఆర్బీకేలన్నింటికీ ఇంటర్‌నెట్ సదుపాయం :

ఆర్బీకేలన్నింటికీ వేగవంతమైన ఇంటర్‌నెట్ సదుపాయం ఉండాలని సీఎం ఆదేశించారు. ఇది ఇంటరాక్టివ్ విధానంలో రైతుల సందేహాల నివృత్తికి ఉపయోగపడుతుందన్నారు. రైతులకు వచ్చే ఖరీఫ్‌లో ఇచ్చే విత్తనాలు కచ్చితంగా నాణ్యతతో ఉండాలని... మార్కెట్లో కొనుగోలుకు ఆసక్తి చూపని వంగడాలు, ఆసక్తి చూపి మంచిధర లభించే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. దీనిపై పోస్టర్లను విడుదల చేయాలన్నారు. దీనివల్ల మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగు పడతాయన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సహాయంతో రైతులకు స్పష్టంగా ఈ విషయాలను తెలియజేయాలని, ఆన్‌లైన్‌లో కూడా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

1. రబీ పంటలు సాగు చేసిన 6,081 ఆర్బీకేల పరిధిలో పంటల కొనుగోళ్లు ప్రారంభించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 28,430 కోట్లతో పంటల కొనుగోళ్లు చేశామని తెలిపారు. ఇందులో ధాన్యం కొనుగోలుకు రూ.22,918 కోట్లు, ఇతర పంటలకు రూ.5,512 కోట్లు వెచ్చించామన్నారు. ఈ సీజన్‌లో 39.11 మెట్రిక్ టన్నుల వేరుసెనగ కొనుగోలుకు ఇప్పటికే 19.95 కోట్లు వెచ్చించారు.

2. 2015-16 నుంచి 2018-19 వరకు గత ప్రభుత్వం నాలుగేళ్లలో పంటల కొనుగోలు కోసం రూ.43,047 కోట్లు మాత్రమే వెచ్చించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి శ్రీ కురసాల కన్నబాబు, వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ శ్రీ ఎంవీయస్ నాగిరెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్బీకే ఛానల్ ప్రారంభం :

రైతులకు అన్ని విధాలా తోడుగా ఉండేలా రూపొందించిన ఆర్బీకే ఛానల్‌ను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ఘట్టంలో ఈ రోజు ఇంకో ముందడుగు వేశామని పేర్కొన్నారు. ఆర్బీకేల్లో స్మార్ట్ టీవీలు పెడుతున్నాం కాబట్టి, అక్కడి రైతులకు చాలా విషయాల మీద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణం గురించి తెలియజెపుతూ నిరంతరం సమాచారం ఇచ్చేందుకు ఈ ఛానల్ ఉపయోగపడుతుందన్నారు. ఏ రైతుకు ఏ సందేహం వచ్చినా టోల్ ఫ్రీ నంబర్ 155251కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. ఇవన్నీ కూడా రైతులకు ఉపయోగపడాలని మనసారా ఆశిస్తున్నానని, రైతులకు ఇంకా మంచి చేసే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



# గ్రామ స్థాయిలో విత్తన ఉత్పత్తి, పంపిణీ




**గ్రామ స్థాయిలో విత్తన ఉత్పత్తి :**

వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంలో విత్తనం ఒక కీలకమైన వనరు. ఇతర వనరుల పనితీరు, సామర్థ్యం విత్తనాల నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. అధిక దిగుబడి సాధించడంలో ధృవీకృత / నాణ్యమైన విత్తనం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పంట ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా చాలా ముఖ్యమైన అంశం.

ఖరీఫ్ 2020లో వేరుశనగ పంట సాధారణ విస్తీర్ణం 7.03 లక్షల హెక్టారులు.

ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ముందుగా పరీక్షించిన నాణ్యమైన విత్తనము రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసే ఉద్దేశముతో, గ్రామ స్థాయిలో రైతుల ద్వారా వేరుశనగ విత్తన ఉత్పత్తి కి 2020-21 లో ప్రణాళిక చేయబడినది . ఖరీఫ్ 2021 లో 4.5 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తన సరఫరా కోసం ప్రస్తుత రబీ 2020-21 లో 39,000 ఎకరాల లో విత్తనం ఉత్పత్తి జరుగుచున్నది, తద్వారా 3 లక్షల క్వింటాళ్ల విత్తనము అందుబాటులోకి వస్తుంది. మిగతా 1.5 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాన్ని (TL) రైతుల నుండి సేకరించ బడుతుంది.

**గ్రామ స్థాయిలో విత్తన సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ చేయుటకు ప్రణాళిక**

ఖరీఫ్ 2021 లో రాయలసీమ జిల్లా రైతులకు వేరుశెనగ విత్తనాల సరఫరా కోసం, తమ జిల్లాలోనే అవసరమైన విత్తనాన్ని సాధ్యమైనంతవరకు రైతుల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు . ధృవీకృత విత్తనానికి ఏదైనా కొరత ఉంటే, నాణ్యమైన విత్తనాన్ని కూడా రైతుల నుండి మాత్రమే సేకరిస్తారు. ప్రైవేట్ విత్తన విక్రయదారులు విత్తనము సేకరించి పంపిణీ చేయడం జరగదు. ఆ జిల్లాలో పంట అందుబాటులో లేనప్పుడు మాత్రమే ప్రభుత్వం ఇతర జిల్లాల నుండి సేకరించి సరఫరా చేయును.

గతంలో నిర్వాహకుల ద్వారా విత్తన సరఫరా సంస్థలు రైతులకు అవసరమైన విత్తనమును సేకరించి పంపిణీ చేసేవారు. దీని వలన క్షేత్ర స్థాయిలో నాణ్యతా పరమైన సమస్యలు ఏర్పడి దిగుబడి పై ప్రభావం చూపేది . రైతుల నుంచి విత్తనం మొలక శాతం పై ఫిర్యాదులు అందేవి. విత్తన సరఫరా సంస్థలు అదిక ధరలకు నిర్వాహకుల నుంచి విత్తనం సేకరించి సరఫరా చేయడం వల్ల రైతులు విత్తనాలకు ఎక్కువ ధర చెల్లించవలసి వచ్చేది. నిర్వాహకులు అదునుకు విత్తనాలు సరఫరా చేసేవాళ్ళు కాదు .

విత్తన సేకరణ నుంచి పంపిణీ వరకు జిల్లా, మండల స్థాయిలో పర్యవేక్షణ, కార్యాచరణ నిమిత్తము వ్యవసాయశాఖ, విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధృవీకరణ సంస్థ అధికారులతో బృందాలను రాయలసీమ జిల్లాలలో ఏర్పాటు చేశారు. ఈ బృందం గ్రామ స్థాయిలో విత్తన సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ చేయుటకు సూక్ష్మ స్థాయి ప్రణాళిక చేసి దాని అమలుకు పర్యవేక్షణ చేస్తారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా రైతులు పండించిన పంటను



రైతుల నుంచి, ప్రభుత్వమే మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుంది.

గ్రామ స్థాయి వ్యవసాయ సహాయకులు విత్తన కోత సమయాన్ని మండల స్థాయి బృందానికి సమాచారం ఇచ్చి, వారి ద్వారా నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి విత్తనాలను సమీపంలోని అనుసం ధానించబడిన ప్రాసెసింగ్ యూనిట్ కు తరలిస్తున్నారు. గతంలో ప్రాసెసింగ్ కోసం గుర్తించబడిన దూరంగా ఉన్న కొన్ని కేంద్రాలకు మాత్రమే తరలించే వారు దీని వలన రవాణా ఖర్చు పెరిగి తద్వారా విత్తన సరఫరా ధర పై ప్రభావం చూపేది.

ప్రాసెసింగ్ నిమిత్తము సంచార ప్రాసెసింగ్ యూనిట్లను ఉపయోగిస్తున్నారు. దీనివలన సరి అయిన సమయానికి రైతులకు విత్తన సరఫరా చేయబడుతుంది. విత్తనం గ్రామంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా తగినంత ప్రచారంతో ఉత్పత్తి చేయబడినందున విత్తనము పై పూర్తి నమ్మకం కలుగుతుంది.

## రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీ విత్తన పంపిణీ.

- గ్రామ విత్తన ఉత్పత్తి ద్వారా సీజన్ ప్రారంభానికి ముందు నాణ్యమైన వేరుసెనగ విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయగలుగు తున్నాము.




- గతంలో విత్తన పంపిణీ మండల స్థాయిలో పంపిణీ చేసేవారు మరియు విత్తనాల కోసం రైతులందరూ మండల కేంద్రానికి వచ్చే వారు. గతంతో పోలిస్తే విత్తనాల నమోదు మరియు పంపిణీ నేరుగా గ్రామములో రైతు భరోసా కేంద్రాల ద్వారా జరగటం వలన రైతులకు శ్రమ , ప్రయాణ, సరఫరా ఖర్చులు తగ్గినవి. గతంలో మండలానికి వెళ్ళలేని వృద్దులు, వికలాంగులు, గ్రామ స్థాయిలో పంపిణీ వలన రాయితీ విత్తన సౌకర్యం పొందగలిగారు.
- ప్రస్తుత పంపిణీ ప్రక్రియలో, గ్రామస్థాయిలోనే రైతులు, విత్తన నాణ్యత ప్రమాణాల ప్రకారం మంచి నాణ్యమైన విత్తనాన్ని పొందగలుగుతున్నారు.
- గ్రామ స్థాయిలో పంపిణీ వల్ల సామాజిక తనిఖీ ద్వారా అర్హుడైన రైతు మాత్రమే విత్తనం పొందగల్గుతున్నాడు. గ్రామ స్థాయిలో పంపిణీ వలన సామాజిక తనిఖీలో రైతులకు తోటి రైతుల వివరాలు తెలుస్తాయి కనుక మధ్యవర్తులు, బ్రోకర్లు వితనాన్ని తీసుకోలేరు. విత్తనం దుర్వినియోగం అయ్యే అవకాశం లేదు.

ఖరీఫ్ 2021లో 4.50 లక్షల క్వింటాళ్ళ వేరుశనగ విత్తనాన్ని రైతుల నుంచి సేకరించిన నాణ్యమైన విత్తనాన్ని రైతులకు రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయడమైనది.

# రబీలో ఈ-క్రాప్ బుకింగ్ మార్గదర్శకాలు



## ఈ-క్రాప్ బుకింగ్:

- యాండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్ యాప్ "ఈ క్రాప్ యాప్" ను ఈ సంవత్సరం వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశు గ్రాస, సామాజిక అటవీ శాఖ, మత్స్య శాఖకు సంబంధించిన సర్వే నంబరు వారీగా సాగు చేసిన ప్రతి పంట విస్తీర్ణం, రైతు వివరాలతో సహా నమోదు చేయడం జరిగింది.
- ఈ విధంగా ఖరీఫ్ 2020లో 120.08 లక్షల ఎకరాలు (వ్యవసాయం- 92.77 లక్షల ఎకరాలు) నమోదు కాగా, రబీ 2020-21లో ఇప్పటివరకు 64.98 లక్షల ఎకరాలు (వ్యవసాయం - 60 లక్షల ఎకరాలు) నమోదు చేయడం జరిగింది.
- ఈ క్రాప్‌లోని సమాచారం వల్ల వ్యవసాయ శాఖలోని వివిధ కార్యక్రమాలైనటువంటి వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వై.ఎస్.ఆర్. సున్నావడ్డీ పంట ఋణాలు, కనీస మద్దతు ధరకు వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ళు వంటి కార్యకలాపాలలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకొనుటకు ఉపయోగపడుతుంది.
- ఈ క్రాప్‌లో నమోదు కాబడిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించి సామాజిక తనిఖీ చేస్తాము.



- పంట వేసిన సాగుదారుని వివరాలను కౌలు రైతులతో సహా ఈ-క్రాప్‌లో పొందుపరచబడింది.
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక గ్రామంలో ఎంతకాలం రైతులు పంటలు సాగుచేస్తారో అన్ని రోజులూ ఈ-క్రాప్ యాప్‌లో రైతులను నమోదు చేసే ప్రక్రియను కొనసాగించడం, గ్రామంలో అన్ని రకాల భూములలో సాగు చేసిన అన్ని పంటలను ఈ-క్రాప్ నందు నమోదు చేయడం జరుగుతుంది.
- అసలైన సాగుదారుని నుండి అధికార యంత్రాంగం ఎటువంటి పత్రాలు అడగకుండా ఈ-క్రాప్‌లో నమోదు చేయడం మరియు ఉద్యాన పంటలను సంవత్సరం పొడవునా ఎలాగైతే ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నామో, వ్యవసాయ పంటలను కూడా సంవత్సరం పొడవునా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
- రైతులు వారి పంటను అమ్ముకొనే సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా వెబ్‌ల్యాండ్‌లో లేని భూములు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ఎండోమెంట్ భూములు, జిరాయితీ భూములు, ఎన్‌క్రోచ్డ్ భూములు, సొసైటీ భూములు, కార్పొరేషన్ భూములు, నోషనల్ ఖాతా భూములు మరియు ఈనామ్ భూములలో సాగుదారుల పేర్లను "ఇన్‌ఫార్మల్ కౌలు" ఎంపిక ద్వారా ఈ-క్రాప్‌లో నమోదు చేయబడినది. దీనికి యజమానుల నుండి అనుమతి అవసరం లేదు.

# రైతులకు రూ.1.13 లక్షల కోట్ల పంట రుణాలు

మన రాష్ట్రంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో రైతులకు బ్యాంకుల ద్వారా రూ. 1.13 లక్షల కోట్ల పంట రుణాలను అందించే అవకాశం ఉందని నాబార్డు పేర్కొంది. ప్రాధాన్య రంగానికి రూ. 2.31 లక్షల కోట్ల మేర రుణాలు ఇస్తామంది. గత ఏడాదితో పోలిస్తే తన రుణ ప్రణాళికను 9% మేర పెంచింది. 2021-22 దార్శనిక పత్రాన్ని (ఫోకస్ పేపర్) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, నాబార్డు సీజీఎం సుధీర్ కుమార్ జొన్నావర్, రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి శ్రీ కురసాల కన్నబాబు గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు రిటైల్ చైన్ అభివృద్ధికి బ్యాంకులు తోడ్పాటు అందివ్వాలని కోరారు. కౌలు రైతులకు మానవతా దృక్పథంతో అధిక మొత్తంలో రుణాలందించాలని సూచించారు. వివిధరంగాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకులు అందిస్తున్న తోడ్పాటు ప్రశంసనీయమని సీఎస్ ఆదిత్యనాథ్ అన్నారు. నాబార్డు ద్వారా 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ. 27,992 కోట్ల సాయం అందించాలని లక్ష్యంగా నిర్దేశించగా, రూ. 32 వేల కోట్లు ఇచ్చినట్లు సీజీఎం సుధీర్ కుమార్ వివరించారు. ప్రస్తుత రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి 68% రుణాలిచ్చేందుకు వీలుందన్నారు.



## రూ. 500 కోట్లతో మార్కెట్ యార్డుల్లో నాడు-నేడు

నాడు-నేడు పథకం కింద రూ. 500 కోట్లతో రెండు దశల్లో మార్కెట్ యార్డుల అభివృద్ధి పనులను చేపడతామని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కురసాల కన్నబాబు గారు ప్రకటించారు. రైతులు ఈ-ప్లాట్‌ఫామ్ ద్వారా తమ ప్రాంతం నుంచే పంటలను విక్రయించు కునే సౌకర్యం లభిస్తుందన్నారు. రూ. 2,900 కోట్లతో పార్లమెంటు నియోజక వర్గానికి ఒక ఆహారశుద్ధి యూనిట్ చొప్పున నెలకొల్పుతామని, దీనికి రూ. 1,800 కోట్ల నాబార్డు నిధులు వినియోగించుకుంటామని వివరించారు.

## ఆర్బీకేలకు 'స్కోచ్ గోల్డ్' అవార్డు




సాగులో మెళకువలు, సాగు ఉత్పాదకాలను రైతుల ముంగిటకు తీసుకెళ్ళే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు 'స్కోచ్ గోల్డ్' అవార్డు దక్కింది. ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారి మానస పుత్రికైన రైతుభరోసా కేంద్రాలను గతేడాది మే 30న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. గ్రామ సచివాయాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన 10,725 ఆర్‌బీకేలు, 154 ఆర్‌బీకే హబ్‌ల ద్వారా గడచిన 11 నెలలుగా వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు సేవలందుతున్నాయి. దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలను స్కోచ్ సంస్థకు సమర్పించారు. ఇందులో భాగంగా మన రాష్ట్రం నుంచి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, వాటి ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలు రైతులకు అందిస్తున్న సేవల వివరాలను వ్యవసాయ శాఖ సమర్పించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్‌బీకేలు అందిస్తున్న సేవలను గుర్తించిన స్కోచ్ సంస్థ వైఎస్సార్ ఆర్‌బీకేలకు బంగారు పురస్కారాన్ని ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో వెల్లడించింది. త్వరలో ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా॥ (శ్రీమతి) పూనం మాలకొండయ్య, కమీషనర్ శ్రీ హెచ్. అరుణ్‌కుమార్ అందుకోనున్నారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

సాంకేతిక విజ్ఞానం

# వ్యవసాయంలో నేల ఉదజని సూచిక ప్రాముఖ్యత



శ్రీ జి. వేణుగోపాలరావు, వ్యవసాయ అధికారి, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు



అనంత జీవరాశికి ఆధారం నేల. పంటలు పండడానికి నేల ముఖ్యమైన సహజవనరు. ఇది పైరుకు కావలసిన ఆధారమును ఇవ్వడమే కాకుండా, తేమను, అవసరమైన పోషకాలను అందిస్తుంది. నేల భౌతిక లక్షణాలతోబాటు, రసాయన లక్షణాలలో ఒకటయిన ఉదజని సూచిక (పి. హెచ్. pH) చాలా ప్రధానమైనది. భూమిలో లభ్యమైన హైడ్రోజన్ అయానుల గాఢత యొక్క ఋణ సంవర్గమానమునే (pH) ఉదజని సూచిక అంటారు. మొక్కలు ఆహార పదార్థములను (పోషకాలను) వాటి అయానుల రూపంలోనే గ్రహిస్తాయి. ఉదాహరణకు నత్రజని పోషకమును మొక్క నత్రజని పోషకము యొక్క అయాను నైట్రేట్ ($NO_3$) రూపంలో గాని / అమ్మోనియం అయాను ($NH_4^+$ రూపంలో గాని గ్రహిస్తుంది. నేల నుండి, మొక్కకు ఈ పోషక అయానుల లభ్యత, నేల యొక్క ఉదజని సూచికపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, నేల ఉదజని సూచిక 6.0 నుండి 7.0 మధ్య ఉన్నట్లయితే, భూమి సమతుల్య స్థితిలో ఉన్నట్లు చెప్పవచ్చును. ఈ ఉదజని సూచిక అవధికన్నా తక్కువ అయితే (ఉదజని సూచిక 6.0 కన్నా తక్కువ) ఆమ్లస్థితి అని, ఉదజని సూచిక ఈ అవధికన్నా ఎక్కువ అయితే (ఉదజని సూచిక 7.0 కన్నా ఎక్కువ అయితే) దానిని క్షార స్థితి అని నిర్ధారించవచ్చు. ఈ రెండు స్థితులలోను, పోషక అయానులు మొక్కల వేరు వ్యవస్థ వద్ద స్థిరీకరించబడి, మొక్కకు లభ్యము కాకుండా పోతాయి. ఈ స్థితి ఏర్పడడానికి గల ముఖ్య కారణాలు.

1. సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువుల వాడకం తగ్గించి, రసాయన ఎరువులను సమతుల్యత లేకుండా, విచక్షణారహితంగా ప్రతిసారి ఒకే పంటను పండించడము.

2. పంటల మార్పిడి విధానమును ఆచరించ కుండా, ప్రతిసారి ఒకే పంటను పండించడము.

3. సాగునీటి నాణ్యతను గమనించకుండా / పరీక్షించకుండా, బోర్ల క్రింద చెరువుల క్రింద, ఆయకట్టు ప్రాంతాలలో సాగుచేయడం.

4. భూసార పరీక్ష ఆధారంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులను సమతుల్యంగా వాడకపోవడము.

కావున భూసార పరీక్ష ద్వారా, భూమి ఉదజని సూచికను నిర్ధారించుకొని, దానిని బట్టి, పంటల సాగు, రకముల ఎంపిక, సేంద్రీయ, రసాయన ఎరువుల వాడకము, మరియు ఇతర యాజమాన్య పద్ధతులను పాటించినపుడే సంతృప్తికరమైన దిగుబడిని సంపాదించగలము.

ఉదజని సూచిక 6.0 కన్నా తక్కువగా ఉన్న నేలలను, (4.5 నుండి 6.0) ఆమ్ల నేలలుగా నిర్ధారిస్తారు. ఆమ్ల లక్షణం గల నేలలు, మొక్కకు ఉపయోగపడే సూక్ష్మజీవులు గణనీయంగా తగ్గిపోతాయి. ఈ స్థితిలో మొక్కకు, నత్రజని, భాస్వరము, పొటాష్, మాలిబ్డినము తగినంతగా లభ్యము కావు. సూక్ష్మ పోషకాలు అయిన జింకు, మాంగనీసు, రాగి, మరియు ఇనుము ఎక్కువగా నీటిలో కరిగి, అధికముగా లభ్యము అయ్యి, మొక్కకు హాని కల్గించే స్థాయికి చేరుతాయి. కాల్షియం, మెగ్నీషియం, మాలిబ్డినం, మొక్కకు అందకుండాపోయి మొక్కలు వేర్లు సరిగా వృద్ధి చెందవు. ఈ స్థితిలో, ఉదజని సూచికను 6.0 నుండి 7.0 మధ్య సరిచేయడానికి, సున్నమును వాడుతారు. ఈ సున్నమును ఎటువంటి రసాయన ఎరువులతో కలిపి వాడరాదు. ఆమ్లగుణంను పెంపొందిచే రసాయన ఎరువులు అయిన, కాల్షియం అమ్మోనియం నైట్రేట్, సల్ఫేట్ ఆఫ్ పొటాష్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (MOP) లను

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

వాడరాదు. ఆమ్లత్వమును తట్టుకొనే బంగాళదుంప, పైన్ ఆపిల్, కాఫీ వంటి పంటలను పెంచాలి.

ఉదజని సూచిక 7.5 ను దాటితే వాటిని క్షార నేలలు అంటారు. ఉదజని సూచిక 7.5 నుండి 8.0 మధ్య ఉన్నప్పుడు, అన్నిరకాల పోషకాలు మొక్కలకు అందుబాటులో ఉంటాయి. ఇవి సాగుకు, చాలవరకు అనుకూలమైన నేలలుగానే చెప్పవచ్చును.

ఉదజని సూచిక 8.0 దాటితే ఆ నేలలను, లవణాల పరిమాణమును బట్టి, లభ్య సోడియం శాతమును బట్టి, మూడు రకాలుగా ఉంటాయి. అవి: 1) ఉదజని సూచిక 8.5 కన్నా తక్కువగా ఉండే నేలలు – తెల్ల చౌడు నేలలు. 2) ఉదజని సూచిక 8.5 కాన్న ఎక్కువగా ఉండే నేలలు (8.5 నుండి 9.0 వరకు) – నల్లచౌడు / కారుచౌడు నేలలు. 3) ఉదజని సూచిక 8.5 కన్నా ఎక్కువగా ఉండే నేలలు (8.5 నుండి 9.0 కన్నా ఎక్కువ) – ఉప్పుచౌడు నేలలు.

**1) తెల్లచౌడు నేలలు :** ఈ నేలలలో, నీటిలో కరిగే లవణాల పరిమాణం ఎక్కువగా ఉండడము వలన, భూమిపైన లవణాలు తెల్లని పొరలాగా ఏర్పడతాయి. నీరు మొక్కలకు బాగా లభ్యం అవుతున్నా, మొక్క వాడినట్లు కనబడుతుంది. ఈ నేలల్లో నత్రజని, భాస్వరము, ఇనుము లభ్యత చాలా తక్కువ. మాంగనీసు, బోరాన్, రాగి, జింకు, నామమాత్రంగా అందుతాయి. మాలిబ్డినం మొక్కకు అస్సలు లభ్యం కాదు.

నాణ్యమైన సాగు నీటిని, మడులలో వదలి, దమ్ముచేసి, నిల్వ ఉంచి, మరుసటిరోజు నీటిని తీసివేయడం ద్వారా ఈ భూములను చాలావరకు సరిచేయవచ్చును.

**2) నల్లచౌడు నేలలు :** ఈ నేలల్లో నీటిలో కరిగే లవణాలు తక్కువ, కాని లభ్య సోడియం శాతము అధికము. ఇది సేంద్రియ పదార్థముతో కలసి పేరుకుపోవడము వలన భూమి నల్లగా





కనిపిస్తుంది. ఈ నేలలు ఆరినప్పుడు గట్టిగా రాయిలాగా ఉండి, తేమ తగిలితే ఎక్కువ బురదగా ఉంటాయి. ఈ నేలల్లో మొక్క మొలవదు. మొలిచినా కూడా ఎదుగుదల సరిగా ఉండదు. ఈ నేలల్లో నత్రజని, భాస్వరం, కాల్షియం, మెగ్నీషియం లభ్యత చాలా తక్కువ. జింకు, మాంగనీసు, ఇనుము, రాగి మరీ తక్కువగా లభిస్తాయి.

ఇటువంటి నేలలను బాగు చేయాలంటే ముందుగా నేలలో అధికంగా లభ్యమయ్యే నీటిలో కరగని సోడియం లవణములను కరిగే సోడియం లవణముగా మార్చి మురుగు ద్వారా తొలగించాలి. ఈ విధంగా కరగని సోడియం లవణాన్ని, కరిగే సోడియం లవణముగా మార్చే పదార్థములలో ముఖ్యమైనది, విరివిగా వాడదగినది – జిప్సమ్.

**3) ఉప్పు చౌడు నేలలు :** ఈ నేలల్లో తెల్ల, నల్ల చౌడు యొక్క రెండు లక్షణాలు ఉంటాయి. నత్రజని నామమాత్రంగా లభ్యము అవుతుంది. భాస్వరము, బోరాన్, కాల్షియం, మెగ్నీషియం మరీ తక్కువగా లభ్యము అవుతాయి.

ఈ నేలల్లో విత్తనాలు మొలకెత్తవు. మొలచిన మొక్కలు ఎదగవు. ఈ నేలలను సరిదిద్దాలంటే సేంద్రియ (లేదా) పచ్చిరొట్ట ఎరువులను వేసి, భూమిలో కలియదున్ని, రెండు వారాల వరకు మురగనిచ్చి, నీటిని తీసివేయాలి, యూరియా, అమ్మోనియం సల్ఫేట్ డి.ఏ.పి. సూపర్ వంటి ఎరువులను వాడవచ్చును.

కావున రైతులు, భూమి భౌతిక లక్షణాలను, రసాయన లక్షణాలను గుర్తెరిగి, ఉదజని సూచిక ప్రాముఖ్యతను అవగాహన చేసుకొని, భూమి, సాగునీటి నాణ్యతను పరీక్షల ద్వారా నిర్ధారించుకొని, సేంద్రియ, రసాయన పచ్చిరొట్ట ఎరువులను సమతుల్యములో వాడినట్లయితే భావితరాలకు మంచి ఆరోగ్యవంతమయిన భూమిని అందించడంతోపాటు, ఆహార భద్రతను పెంపొందించడములోను, సహాయపడినవారము అవుతాము.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# రసాయన పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



శ్రీ ఎం.వి.శ్రీకాంత్, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు.

రసాయన పురుగు మందులు లేకుండా వ్యవసాయాన్ని చేయలేమనే భావనలో రైతాంగం ఉన్నారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ విధానంలో అనేక మంది రైతులు రసాయనాల జోలికి వెళ్లకుండా బాగుపడుతున్నా అధిక శాతం రైతాంగం ఆ దిశగా ప్రయత్నించడం లేదు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభం పొందాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. ఆ దిశగా ఎన్నో కార్యక్రమాల ద్వారా సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై నిత్యం అవగాహన కలిపిస్తూనే ఉన్నది. అయినప్పటికీ చాలామంది రైతులు పురుగు మందుల వాడకంలో తగిన మెళకువలు పాటించడం లేదు. పంటల సాగులో రైతులు అధికంగా ఖర్చు పెట్టేది సస్యరక్షణ పైనే. అనవసరంగా కూడా మందులపై ఖర్చు చేస్తున్నారు. మిరప, వంగ పంటలలో వీటి వాడకం విపరీతంగా ఉంటుంది. వాడేటపుడు కూడా చేతితో మందులను కలపడం, శరీరంపై తగిన జాగ్రత్తలు తీసుకోకుండా మందులను పిచికారి చేయడం లాంటివి జరుగుతున్నవి. కలుపు మందులు వాడేటపుడు వెనక్కి నడుస్తూ పిచికారి చేస్తున్నా, వారి కాళ్ళపై పడేలా పిచికారి చేస్తున్న రైతాంగం కూడా ఉన్నారు.

సమగ్ర సస్య రక్షణలో చివరి అస్త్రంగానే పురుగు మందులను వాడుకోవాలి. అవగాహన లేని అనేకమంది రైతాంగం పురుగు దశ, పంట దశను దృష్టిలో పెట్టుకోకుండా విచక్షణారహితంగా వాడిన పురుగుమందునే మళ్ళీ వాడుతూ, సిఫారసుకు మించిన మోతాదులో వాడుతూ సాగు ఖర్చును పెంచుకుంటున్నారు. అవసరం లేకున్నా రెండు మందులను కలిపి వాడటం జరుగుతున్నది. దీనివల్ల శత్రు పురుగుల బెడద తగ్గకపోగా, మిత్ర పురుగులు నశించిపోతున్నాయి. రసాయన మందులను వాడాల్సిన విధంగా వాడితేనే ఆశించిన ఫలితం ఉంటుంది. పురుగు మందులు సమర్థవంతంగా పనిచేయాలంటే కొన్ని సూచనలు తప్పక పాటించాలి.




అవగాహన లేని రైతాంగం పంటపై సూక్ష్మ పోషక లోపాల సవరణకు తెగుళ్ళ మందులను వాడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. మార్కెట్‌లో దొరికే పురుగుమందు రసం పీల్చు పురుగుల్ని, కాయతొలుచు పురుగుల్ని రెండింటినీ చంపడం జరగదు. అలాగే తామర పురుగు, పచ్చదోమ, పిండినల్లి, పేనుబంక వంటి రసం పీల్చు పురుగుల మీద పనిచేసే మందు నల్లి మీద పనిచేయదు. నల్లికి మైటిసైడ్ వాడాలి. కాబట్టి అన్ని రసం పీల్చు పురుగులకు ఒకే మందు పనిచేయదు. ముందుగా చేనులో ఆశించిన పురుగును ఖచ్చితంగా గుర్తించి వాటికి సంబంధించిన మందు వాడాలి.

రసం పీల్చు పురుగుల నివారణకు 'నియోనికోటినాయిడ్' గ్రూపుకు చెందిన మందులు వాడుతున్నారు. ఇమిడాక్లోప్రిడ్, థయామిథోక్సామ్, అసిటామిప్రిడ్ లాంటివి ఈ గ్రూపుకు చెందినవి. ఈ మూడూ ఒకే గ్రూపునకు చెందినవి కావున వాటిని పంటలో ఒకసారి వాడితే సరిపోతుంది. ఈ ఒకే గ్రూపునకు చెందిన మందులను మార్చి, మార్చి వాడితే పురుగులకు రోగనిరోధకశక్తి పెరిగిపోయి ఎన్నిసార్లు మందులు వాడినా ప్రయోజనం ఉండదు. ఖర్చు వృథా అవుతుంది. పురుగు నివారణ సమర్థవంతంగా జరగక

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

దిగుబడి తగ్గిపోతుంది. మళ్ళీ, మళ్ళీ ఒకే గ్రూపునకు చెందిన మందులు వాడటం మంచిది కాదు. తెగులు మందులు, పురుగు మందులు వేరు వేరుగా ఉంటాయి. అవగాహన లేక పురుగులకు తెగులు మందులు వాడితే ఫలితం శూన్యం. గ్రామాలలో సాధారణంగా చేను ఎర్రబడిందని, ఆకులు మాడుతున్నాయని, మొక్కల ఎదుగుదల సరిగా లేదని సగటు రైతు డీలరు షాపుకు వెళ్ళినపుడు వారు చాలా సందర్భాలలో ఓ పురుగు మందు, తెగులు మందు, సూక్ష్మపోషక ఎరువును కలిపి అమ్ముతుంటారు. అది తెగులు లక్షణమూ, పోషకలోప లక్షణమా అని తెలియక ఇలా అన్ని మందులను వాడటం వల్ల సాగు ఖర్చు అనవసరంగా పెరుగుతుంది. వరిలో జింకులోప సవరణకి చిలేటెడ్ జింకును వాడాల్సిన చోట అనవసరమైన పురుగు, తెగులు మందులు కలిపి వాడి సాగు ఖర్చును పెంచుకుంటున్నారు. పంట సమస్యను వ్యవసాయ అధికారుల దృష్టికి తెచ్చి వారి సలహా మేరకు తగిన మందును కొనాలి.




పురుగు మందులు కొనేముందు రసీదు తప్పక తీసుకోవాలి. ఆ రసీదులో కూడా తయారు తేదీ, గడువు తేదీ, బాచ్ నెంబరు మొదలైనవి ఉండేలా జాగ్రత్త పడాలి. రైతు సంతకము తప్పక ఉండాలి. నాణ్యత సరిగా లేనపుడు చట్టపరమైన చర్యలు తీసుకోడానికి ఉపయోగపడుతుంది. పురుగుమందు డబ్బాల మీద ఉన్న వివరాలను బాగా పరిశీలించి కొనాలి. గడువు తేదీని గమనించాలి. తీసుకొనే మందును వెంటనే వాడకపోతే త్వరలో గడువు ముగిసే వాటిని కొనకపోవడమే మంచిది. పురుగు మందుల ఇంటిలో పిల్లలకు అందుబాటులో లేకుండా ఉంచాలి.

పురుగు మందు వాడే ముందు స్ప్రేయర్ల విషయంలో తగిన జాగ్రత్త వహించాలి. అంతకు ముందు కలుపు మందు వాడి ఉంటే, తగిన జాగ్రత్త లేకుండా అదే స్ప్రేయర్‌ను పురుగు మందు పిచికారికి వినియోగిస్తే కలుపు అవశేషాలు పంటను నాశనం చేసే అవకాశం ఉంటుంది. రెండు మూడు సార్లు ఆ స్ప్రేయరును బాగా కడిగి, ఆరబెట్టి ఆ తరువాతనే పురుగు మందు పిచికారికి వాడుకుంటే మంచిది. వాడే స్ప్రేయర్‌ను బట్టి లీటరు నీటికి కలిపే మందు మోతాదు మారుతుంది. తైవాన్ పంపును వాడితే చేతి పంపుకు వాడే మోతాదుకు రెట్టింపు మోతాదులో వాడాలి. ఉదా: క్లోరిపైరిఫాస్ మందును చేతిపంపుతో లీటరు నీటికి 2.5 మి.లీ. కలిపి వాడితే తైవాన్ స్ప్రేయర్‌తో రెట్టింపు మోతాదు అనగా లీటరు నీటికి 5 మి.లీ. కలిపి వాడాలి. చేతి పంపుతో ఎకరానికి 200 లీటర్ల నీరు అవసరమైతే, పవర్ స్ప్రేయర్/తైవాన్ స్ప్రేయర్ వాడినపుడు 100 లీటర్ల నీరు ఎకరానికి సరిపోతుంది. ఈ జాగ్రత్త పాటించక పోవడం వల్లే చాలా మంది రైతులు మందులు పురుగులపై పనిచేయడం లేదని తెలియజేస్తుంటారు. పురుగు మందు, తెగులు మందును కలిపి వాడే ముందు కూడా రైతులు, అధికారుల, శాస్త్రవేత్తల సలహా తప్పక తీసుకోవాలి. కూరగాయల మీద వాడేటపుడు మరింత జాగ్రత్తలు పాటించాలి. పురుగు మందులు వాడిన వారం వరకు వాటిని తెంపకూడదు. పురుగు మందు డబ్బాల మీద విష ప్రభావ తీవ్రతను సూచించే త్రిభుజాకార రంగులు (ఎరుపు, పసుపు, నీలము, ఆకుపచ్చ) ఉంటాయి. అన్నింటికంటే ఎరుపు రంగు త్రిభుజాకారం ఉన్నవి అధిక ప్రమాదకరమైనవి. వీలైనంతవరకు వీటిని కూరగాయలపై చాలా తక్కువగా వాడాలి.

పొలంబడి కార్యక్రమం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే మెళకువలను నేర్చుకొని రసాయన పురుగు మందుల వాడకాన్ని బాగా తగ్గించాలి. సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పంట తొలిదశ నుంచి పాటిస్తూ అవసరం మేరకే తగిన మందులను, సరైన మోతాదులో, సరైన పద్ధతిలో వాడాలి.

# మేలైన విత్తనాల సరఫరాలో రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ



డా. ఏ. త్రివిక్రమ రెడ్డి, సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ, గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ రైతులకు మేలైన విత్తనములు సరఫరా చేయుటకు సేవ, అంకితభావముతో పనిచేయుచున్న ఏకైక సంస్థ. ధృవీకరణ విత్తనములు వాడటం వలన ఖచ్చితముగా 15–20% పంట దిగుబడి ఎక్కువగా వచ్చును అని శాస్త్రజ్ఞులు నిర్ధారించిరి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ తమ అధికారులచే వివిధ సందర్భములలో ఖచ్చితమైన పంట విత్తన పర్యవేక్షణలు చేయడము ద్వారా నాణ్యమైన విత్తనము రైతులకు అందజేయబడుతున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ, విత్తన ధృవీకరణ ప్రక్రియలో భారత దేశములో అత్యంత ప్రసిద్ధ రాష్ట్రముగా పేర్కొనబడుచున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయి ధృవీకరించ బడిన విత్తనములు ఆంధ్రప్రదేశ్ రైతాంగ అవసరాలతో పాటు ఇతర రాష్ట్రాలు అయినటువంటి తెలంగాణ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, హరియాణాలకు ఎగుమతి కాబడుచున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ ప్రభుత్వము వారిచే నియమించబడిన పాలకమండలి ఆదేశాలమేరకు, కేంద్ర విత్తన



చట్టము – 1986 ప్రకారం తమ విధులను నిర్వహించును. సదరు పాలకమండలి, ముఖ్యకార్యదర్శి, వ్యవసాయ శాఖ అధ్యక్షతన 15 మంది సభ్యులతో కార్యక్రమాలు నిర్వహించబడును.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తరువాత ప్రస్తుతం APSSCA నందు 126 మంది సభ్యులతో 58 మంది సాంకేతిక నిపుణులు మిగిలిన 68 మంది ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థకు ప్రభుత్వము నుంచి ఎలాంటి నిధులు గాని ఖజానా గాని, కేటాయింపబడదు.

| S.No | కార్యాలయం | పరిధి | నేతృత్వం |
|---|---|---|---|
| 1 | O / o డైరెక్టరేట్, గుంటూరు | ఆంధ్రప్రదేశ్ | సంచాలకులు |
| 2 | జోనల్ కార్యాలయాలు (2) | | |
| | 1. కర్నూలు | అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప | చీఫ్ సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ |
| | 2. గుంటూరు | గుంటూరు, ఒంగోలు, తణుకు | |
| 3 | డివిజనల్ కార్యాలయాలు (7) | | |
| | 1. అనంతపురం | అనంతపురం | సీనియర్ సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ |
| | 2. కర్నూలు | కర్నూలు | |
| | 3. నంద్యాల | నంద్యాల | |
| | 4. కడప | కడప | |
| | 5. గుంటూరు | గుంటూరు & కృష్ణ | |
| | 6. ఒంగోలు | ఒంగోలు,చిత్తూరు, ప్రకాశం & నెల్లూరు | |
| | 7. తణుకు | తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం & విశాఖపట్నం | |
| 4 | విత్తన పరీక్షా కేంద్రాలు (2) | కడప & గుంటూరు | సీనియర్ సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ |
| 5 | GOT ఫారం | రెడ్డిపల్లి, అనంతపురం | సీనియర్ సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్, అనంతపురం |





సంస్థ వివిధ రకాల రుసుములు, ఫీజులు ద్వారా సంస్థ తమ స్వీయ మొత్తమును సమకూర్చుకుని, ఉద్యోగస్తుల జీత భత్యాలను భరించుచూ రైతులకు మేలైన విత్తనములను సరఫరా చేసే సేవా కార్యక్రమమును చేయుచున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థలో నమోదు చేసుకొనినవిత్తన క్షేత్రములను పంట రకములను బట్టి విత్తన ధృవీకరణాధికారులు తనిఖీ ప్రక్రియలు చేసెదరు. తనిఖీ సమయములో నిర్దేశింపబడిన ప్రామాణికములకు పంట క్షేత్రము అనుకూలముగా ఉన్నదా! లేదా! అని ఖచ్చితత్వముతో విత్తన ధృవీకరణాధికారులు విత్తన తనిఖీలు చేయుదురు. సదరు సమయములో ముఖ్యముగా పంట యొక్క కేళీ రకములను, ఏకాకత్వ దూరములను, కలుపు మొక్కలను గుర్తించి నిర్దేశింప బడిన ప్రామాణికము కన్నా ఎక్కువగా ఉన్నచో సదరు విత్తన క్షేత్రమును తిరస్కరించి ప్రామాణికమునకు లోబడి ఉన్న విత్తన క్షేత్రాలను ధృవీకరించెదరు.

తద్వారా ఉత్పత్తి అయిన విత్తనమును విత్తన శుద్ధి కర్మాగారాలకు తరలించి ప్రాసెసింగ్ చేసిన తర్వాత విత్తన ధృవీకరణాధికారుల సదరు విత్తనము నుండి శాస్త్రీయ పద్ధతిలో విత్తన నమూనాలను సేకరించి నిబంధనల ప్రకారము వాటిని విత్తన పరీక్షా కేంద్రములకు రాష్ట్ర ముఖ్య కార్యాలయము ద్వారా పంపబడును. పంట రకములను బట్టి సంతృప్తి కరమైన నాణ్యతా ఫలితాలు వచ్చిన విత్తన లాటులను భారత ప్రభుత్వ కనీస విత్తన ప్రమాణాలు ప్రకారము ధృవీకరించబడును. అసంతృప్తికర ప్రమాణలు నమోదు చేసిన విత్తన లాట్లను అధికారులు తిరస్కరించెదరు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సొసైటీస్ యాక్ట్ క్రింద రిజిష్టర్ చేయబడినది. సదరు సంస్థ 01-06-1977 నుంచి తన విధులను సీడాక్ట్-





1966 మరియు సీడ్ రూల్స్-1968 ప్రకారము చట్టబద్ధముగా తమ విధులను నిర్వహించుచున్నది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తరువాత APSSCA సంస్థను గుంటూరు రిజిష్టర్ ఆఫీస్ యందు Societies Registration Act 2001 ప్రకారము రిజిష్టర్ చేయబడి తమ కార్యకలాపాలను గుంటూరు కేంద్రంగా నిర్వహించుచున్నది.

విత్తన ధృవీకరణ ప్రక్రియ ఈ క్రింది 6 దశలలో పూర్తి చేయబడును.

1. ఉత్పత్తిదారుని దరఖాస్తు పరిశీలన
2. విత్తనోత్పత్తికి ఉపయోగించిన మూల విత్తన పరిశీలన
3. విత్తన నాణ్యత పరిశీలన కొరకు క్షేత్ర స్థాయి తనిఖీలు
4. పంట నూర్పిడి తర్వాత విత్తన శుద్ధి కర్మాగారంలో విత్తన తనిఖీలు
5. విత్తన నమూనాలు సేకరించడము, జన్యు స్వచ్ఛత మరియు మొలక శాతము కొరకు నమూనాలను పంపుట
6. ధృవీకరణ ట్యాగులను కేటాయించుట, ఫారం-2ను ఇవ్వడం

ముఖ్యముగా ఆంధ్రప్రదేశ్‌లో వరి, వేరుశనగ, శనగ, జనపనార, అపరాల విత్తనోత్పత్తి జరుగుతుంది.

విభజన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ ఆధ్వర్యములో రెండు విత్తన పరీక్షా కేంద్రములు గుంటూరు కడపలో ఏర్పాటై ఉన్నాయి. విత్తన మొలక శాతం, తేమ శాతం పరీక్షించటానికి విత్తన నమూనాలను పై రెండు విత్తన పరీక్షా కేంద్రములకు పంపుతాము.



# వేసవి పంటగా పెసర సాగు

శ్రీమతి జి. పద్మజ, వ్యవసాయాధికారి, రైతు శిక్షణా కేంద్రం, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు

వేసవిలో పండించే అపరాల్లో పెసర ముఖ్యమైన పంట. సుమారు 65-70 రోజుల్లో కోతకు వచ్చే ఈ పంట దాదాపు అన్ని కాలాల్లో సాగుకు అనువైనది. అయినా రైతులు ఈ పంట సాగుకు సుముఖత చూపక పోవడానికి అనేక కారణాలున్నాయి. నిస్సారమైన భూముల్లో వర్షాధారంగా సాగుచేయడం, అధిక దిగుబడి నిచ్చే రకాలను ఎంపిక చేసుకోకపోవడం, చీడ పీడల బెడద ఎక్కువగా ఉండడం, పంటకు సరైన ధర రాకపోవడం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. రైతులు సరైన యాజమాన్య పద్ధతులతో సాగుచేస్తే వాణిజ్య పంటలతో పోటీగా ఇందులో ఆదాయాన్ని పొందవచ్చు.

పెసర అవసరమైన మాంసకృత్తులు, ఖనిజ లవణాలను అందించడమే కాకుండా, నత్రజని స్థిరీకరణ ద్వారా నేలను సారవంతం చేస్తుంది. పెసర సాగుకు సుమారు 300 మి.మీ. నీరు అవసరం. తక్కువ నీటివసతి ఉన్న రైతులు కీలక దశల్లో 3-4 నీటి తడులు ఇచ్చి పంటను కాపాడవచ్చు. వాణిజ్య పంటలైన మిరప, ప్రత్తి, పసుపు, రబీ మొక్కజొన్న, వేరుశెనగ, వరి పండిన తర్వాత ఖాళీగా ఉన్న భూముల్లో పెసర సాగు చేయవచ్చు.

**విత్తడం :** వేసవి పంటగా మార్చి నెల వరకు విత్తుకోవచ్చు. చౌడు, మురుగు నీరు నిలిచే భూములు పనికిరావు. నేలను దున్ని మెత్తగా తయారుచేసుకోవాలి. ట్రాక్టరుతో విత్తితే ఎకరాకు 7-8 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 10-12 కిలోల విత్తనం అవసరం.

**విత్తన శుద్ధి :** విత్తే ముందు కిలో విత్తనానికి గౌచ్ ఎఫ్.ఎస్ - 600 మందు 5 మి.లీ. లేదా ఇమిటాక్లోప్రిడ్ 5 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 5 మి.లీ. + మాంకో జెబ్ 2.5 గ్రా. లేదా





థైరమ్ 2.5 గ్రా. కలిపి విత్తన శుద్ధి చేసినట్లయితే సుమారు 20 రోజుల వరకు రసం పీల్చే పురుగులు, తెగుళ్ళ బారి నుండి పంటను రక్షించుకోవచ్చు. విత్తన శుద్ధి  చేయడం వలన పైరు తొలిదశలో రసం పీల్చే పురుగులను నివారించడమే గాక వాటి ద్వారా వ్యాపించే వైరస్ తెగెళ్ళను నివారించవచ్చు. అందుబాటులో ఉంటే చివరగా ఎకరానికి సరిపడా విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చరు పట్టించి, నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. సాళ్ళ మధ్య 22.5 - 25 సెం.మీ., సాళ్ళలో మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలో ఎకరానికి 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరాన్ని ఇచ్చే ఎరువులను వేయాలి. పశువుల ఎరువు 2-3 టన్నులు వేయాలి.

**అనువైన రకాలు :** వేసవి పంటగా సాగుకు పెసరలో డబ్ల్యు.జి.జి. 42, 37, ఎల్.జి.జి. 460, ఐ.పి.ఎం. - 2, 14 రకాలు అనువైనవి. ఈ రకాలన్ని సుమారు 60-70 రోజుల్లోగా పంటకొచ్చి ఎకరాకు 5-6 క్వింటాళ్ళ ద్వాకా దిగుబడిస్తాయి.

వరంగల్ 42 రకం (డబ్ల్యు.జి.జి.-42) : పొడవైన కాయలు, లావు పాటి మెరుపు గింజలు కలిగి, పల్లాకు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది.

**లాం 460 (ఎల్.జి.జి.-460) :** కాయలు గుత్తులుగా పై భాగంలో వుండి ఒకేసారి కోతకు వస్తుంది. పల్లాకు, మొవ్వ కుళ్ళు తెగులును తట్టుకుంటుంది. పాలిష్ రకం.

**ఐ.పి.యం - 2-14 :** మొక్క నిటారుగా పెరిగి ఒకేసారి కోతకు వస్తుంది. మధ్యస్థ లావు గింజలు కలిగి, పల్లాకు తెగులును తట్టుకునే పాలీష్ రకం.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



**నీటి యాజమాన్యం :** వేసవిలో సాధారణంగా 3-4 నీటి తడులు అవసరం. నేల స్వభావాన్ని బట్టి 15-20 రోజుల వ్యవధిలో 2-3 నీటి తడులు ఇవ్వాలి. మొగ్గదశ, కాయ ఏర్పడే దశ, గింజకట్టే దశలు కీలకం. ఒకవేళ బెట్ట పరిస్థితులలో పైరు సరిగా ఎదగకపోతే 2 శాతం (20 గ్రా/లీ.) యూరియా లేదా 13-0-45 (మల్టీకే) 1.5 శాతం (15 గ్రా/లీ) ద్రావణాన్ని అవసరాన్ని బట్టి 10-12 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**కలుపు యాజమాన్యం :** విత్తిన వెంటనే లేదా మరుసటిరోజు పెండిమిథాలిన్ 20% ఎకరాకు 1.5 లీ. నేల తేమగా వున్నపుడు పిచికారి చేయాలి. ఒకవేళ పంట మొలచిన 18-20 రోజుల్లో కలుపు ఎక్కువగా ఉంటే ఎకరానికి ఇమజితాఫిర్ 250 మి.లీ. మందు పొలంలో తేమ ఉన్నపుడు పిచికారి చేయాలి. విత్తిన 20-30 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. 20-25 రోజుల పైరు దశలో సాళ్ల మధ్య గొర్రు తోలితే కలుపు నివారణతో పాటు బెట్ట పరిస్థితుల నుంచి పంటను కొంతవరకు కాపాడుకోవచ్చు.

**పెసరలో పల్లాకు తెగులు :** ఈ తెగులు వల్ల 95 శాతం వరకు పంటకు నష్టం కలిగే అవకాశం ఉంది. మొదట ఈ తెగులు పసుపు రంగు మచ్చలుగా, లేత ఆకుల మీద కనిపిస్తుంది. క్రమేపి మచ్చలు పెరిగి పసుపు, ఆకుపచ్చ చారలుగా (మొజాయిక్) ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువైనపుడు ఆకులు, పిందెలు, కాయలు పూర్తిగా పసుపు రంగులోకి మారి కాయలు వంకరలు తిరుగుతాయి. ఆకులు పసుపు రంగులో వుండడం వల్ల పిండి పదార్థాలు తయారుగాక కాయలో విత్తనాలు ఏర్పడవు.

**యాజమాన్యం :** తెగులును తట్టుకునే రకాలు (ఎం.జి.జి.-295, ఎం.జి.జి.-347, 351, 42, ఐ.పి.యం-2-14) సాగు చేయాలి. పైరు విత్తే ముందు తప్పనిసరిగా ఇమిడాక్లోప్రిడ్ ఎఫ్.ఎస్. 600 మందు 5 మి.లీ/కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఈ తెగులును వ్యాపింప చేసే రసం పీల్చే పురుగుల నివారణకు పంట చుట్టూ 4 వరుసల జొన్నగాని, మొక్కజొన్న గాని వేసుకోవాలి. పొలం చుట్టుప్రక్కల వైరస్ తెగులు వ్యాపించిన ఇతర మొక్కలను, కలుపు మొక్కలను నాశనం చేయాలి. తెల్లదోమ నివారణకు గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలను ఎకరాకు 20 చొప్పున పెట్టుకోవాలి. తెల్లదోమ నివారణకు తొలిదశలో వేపగింజల కషాయం గానీ, వేప నూనె గాని పిచికారి చేసుకోవాలి. ఎసిఫేట్ 200 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 40 గ్రా.



లేదా ట్రైజోఫాస్ 400 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 40 గ్రా.లలో ఏదో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు మార్చి మార్చి పిచికారి చేయాలి.

మన రాష్ట్ర వ్యవసాయశాఖ శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ వేసవిలో అపరాల పంట సాగుకు ప్రణాళికను రూపొందించింది. ఈ ప్రణాళికలో భాగంగా పెసర, మినుము పంటల విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించింది. వీటి విత్తనాల సరఫరా లక్ష్యాలు, అమ్మకం ధరలు, విత్తన సబ్సిడీ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**విత్తన సరఫరా లక్ష్యాలు :**

| జిల్లా | మినుము (క్వి) | పెసర (క్వి) |
|---|---|---|
| శ్రీకాకుళం | 0 | 100 |
| విజయనగరం | 5 | 7 |
| తూర్పుగోదావరి | 994.4 | 507.3 |
| పశ్చిమగోదావరి | 831 | 466 |
| మొత్తం | 1830 | 1080 |

**విత్తన సబ్సిడీ వివరాలు :**

| విషయం | మినుము | పెసర |
|---|---|---|
| అమ్మకం ధర | రు.9660/క్వి | రు.10652/క్వి |
| ప్రభుత్వ సబ్సిడీ | రు.2500/క్వి | రు.5000/క్వి |
| రైతులు చెల్లించాల్సిన రుసుము | రు.7160/క్వి (రు.71.60 కిలోకు) | రు.5652/క్వి (రు.56.52 కిలోకు) |

# రైతు స్థాయిలో మొలక శాతం తెలుసుకునే పద్ధతులు



శ్రీ కె. శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వనరుల కేంద్రం, అనకాపల్లి

అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనం అవసరం. సాధారణంగా రైతులు విత్తనాలను పరిశోధన స్థానాలు, ఎన్.జి.ఓ.లు లేదా ఇతర ప్రయివేట్ కంపెనీల నుంచి కొనుగోలు చేస్తారు. వివిధ కారణాల వలన విత్తనాలు నాణ్యతను కోల్పోయే అవకాశం ఉంది. అందువల్ల రైతులు విత్తన కొనుగోలు తర్వాత మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలకశాతం అధికంగా ఉంటేనే మొక్కల సాంద్రత బాగుండి దిగుబడి అధికంగా వస్తుంది.

## నాణ్యమైన విత్తనం లక్షణాలు :

విత్తనం రైతు ఎంచుకున్న రకానికి మాత్రమే చెందింది అయి వుండాలి. విత్తనం వంద శాతం జన్యు స్వచ్ఛత కలిగి ఉండాలి. భౌతిక స్వచ్ఛత అనేది విత్తనానికి ఉండాల్సిన రంగు ఉండి, తాలు, సగం నిండిన గింజలు ఉండకూడదు. కొనుగోలు చేసిన విత్తనాల్లో వేరే రకానికి చెందిన విత్తనాలు, కలుపు విత్తనాలు, మట్టిగడ్డలు, ఇసుక, దుమ్ము ఉండకూడదు. విత్తనం ఎల్లప్పుడు సురక్షితమైన ప్యాకింగ్ చేసి, పూర్తి వివరాలతో ముద్రించిన లేబుల్ కలిగి ఉండాలి.

వరిలో 80 శాతం, గోధుమ 85 శాతం, జొన్నలు 75 శాతం, మొక్కజొన్న - సూటి రకాలు 90 శాతం, సంకర రకాలు 80 శాతం, సజ్జ, కొర్ర 75 శాతం, శనగ 85 శాతం, అపరాలు 75 శాతం, కూరగాయలు 60-70 శాతం మొలక శాతం కలిగి యుండాలి.

నూనె గింజల్లో సోయా చిక్కుడు, ఆముదం, వేరుశనగ 70 శాతం పొద్దుతిరుగుడు, నువ్వులు 80 శాతం, నారపంటలు (పత్తి, గోగు) 75 శాతం మొలక శాతాన్ని కలిగి యుండాలి.

## రైతు స్థానంలో మొలక శాతం తెలుసుకునే పద్ధతులు:

గుడ్డలో మూటకట్టు పద్ధతి : వంద విత్తనాలను తడిగుడ్డలో మూటకట్టి ప్లేటులో పెట్టి తరుచూ మూటను నీటితో తడుపుతూ ఉండాలి. విత్తనాలు మొలకలొచ్చాక లెక్కించి మొలకశాతాన్ని తెలుసుకోవచ్చు.

## ట్రే పద్ధతి / కుండీ పద్ధతి :

ఈ పద్ధతి లావు గింజలైన ఆముదం, శనగ, పత్తి,



వేరుశెనగ మొదలైన విత్తనాల నాణ్యతను తెలుసుకోవడానికి ఉపయోగించవచ్చు. ఇందులో మొదట ఒక ప్లాస్టిక్ ట్రే గాని లేదా కుండీ గాని తీసుకొని ఇసుకతో నింపాలి. తదుపరి వంద విత్తనాలను అంగుళం లోతుగా నిర్ణీత స్థలంలో విత్తుకోవాలి. ఇసుకను నీటితో తడుపుతూ ఉంటే 7-10 రోజుల్లో మొలకలు వస్తాయి. అప్పుడు రైతులు వందకు ఎన్ని మొలకలొచ్చాయో లెక్కించి మొలకశాతం తెలుసుకోవచ్చు. ముందుగా నిర్దేశించిన శాతం కంటే తక్కువగా మొలకలొస్తే నాణ్యత లోపించిన విత్తనంగా భావించాలి.

## పెట్రిడిష్ పద్ధతి :

చిన్న సైజు విత్తనాలు అనగా వంగ, టొమాటో, మిరప మొదలగు విత్తనాల మొలకశాతం ఈ పద్ధతి ద్వారా తెలుసుకోవచ్చు. ఇందులో మొదట పెట్రిడిష్‌లో బ్లాటింగ్ పేపరు అమర్చి మూతపెట్టాలి. తేమ ఆరిపోకుండా బ్లాటింగ్ పేపరును నీటితో తడుపుతూ ఉండాలి. మొలకెత్తిన గింజలను లెక్కించి మొలక శాతాన్ని సులభంగా తెలుసుకోవచ్చు.



## పేపర్ టవల్ పద్ధతి :

ఈ పద్ధతి ముఖ్యంగా వరి, ప్రత్తి, పొద్దు తిరుగుడు, జొన్న తదితర విత్తనాల్లో మొలకశాతం తెలుసుకోవడానికి



వినియోగిస్తారు. ఈ పద్ధతిలో ముందుగా పేపర్ టవల్ లేదా మందపాటి వస్త్రాన్ని తీసుకొని నీటితో తడపాలి. తదుపరి నేలపై పరిచి వంద విత్తనాలను వరుసగా అమర్చాలి. ఇప్పుడు మరొక వస్త్రాన్ని లేదా పేపరు టవల్‌ను గాని విత్తనాలపై కప్పాలి. తరువాత రెండింటిని ఒక చాపలో చుట్టి చివర్లను దారంతో కట్టి ఏదైనా లోతైన పాత్రలో ఏటవాలుగా పెట్టాలి. తేమ ఆరిపోకుండా ఉండేందుకు అప్పుడప్పుడు నీటితో తడుపుతూ ఉంటే మొలకలు రావడం జరుగుతుంది.

గమనిక : మొలక శాతాన్ని లెక్కించేటప్పుడు కుళ్లిపోయిన, మొలక రాని, గట్టి విత్తనాలను, బూజుపట్టిన వేరుకాండం, పూర్తిగా అభివృద్ధి చెందని, బలహీనంగా ఉన్న మొక్కలను పరిగణనలోనికి తీసుకోకూడదు.

## మొలక శాతం తగ్గడానికి కారణాలు :

(1) అధిక తేమ శాతం వల్ల విత్తనాలలో మొలక శాతం త్వరగా క్షీణిస్తుంది. (2) రైతులు పరిపక్వతకు రాని గింజల నుంచి విత్తనాలు సేకరించినప్పుడు. (3) వివిధ రకాల చీడపీడలు, శిలీంద్రాలు సోకినప్పుడు గాలి, వెలుతురు లేని గదుల్లో నిల్వ చేయడం వల్ల మొలక శాతం తగ్గుతుంది. (4) ఎరువులు, పురుగు మందులు, మిరపకాయల బస్తాల ప్రక్కన విత్తనాలను నిల్వ చేయడం. (5) విత్తనం చుట్టూ అనుకూలమైన ఉష్ణోగ్రత, ఆక్సిజన్ సరఫరా లేకపోవడం. (6) దుక్కి సరిగా దున్నకపోవడం. (7) కలుపు మందుల పిచికారి పట్ల అవగాహన లేకపోవడం వల్ల కూడా మొలకశాతం ఉన్న మొలకలు పెరగకపోవడం వంటివి ప్రధాన కారణాలు.

## మొలక శాతం పెరగాలంటే :

- పరిపక్వత వచ్చిన గింజల నుంచి విత్తనాలు సేకరించాలి.
- వరిలో కత్తెర పంట, వర్షాకాలంలో మొలకెత్తిన విత్తనాల్ని నారుమడిలో చల్లినా అధిక ఉష్ణోగ్రతల వల్ల మొలక నారుగా మారదు.
- విత్తనం వేసే ముందు ఖచ్చితంగా విత్తనశుద్ధి చేసినట్లయితే మొలకశాతం పెరుగుతుంది.
- విత్తనాలు నిల్వ చేసే ముందు విత్తనంలో తేమ శాతం తగినంత మాత్రమే ఉండేలా చూచుకోవాలి. వివిధ రకాల పంటలను బట్టి 9-12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి.
- విత్తనాలు కొనేటప్పుడు ఖచ్చితంగా లేబుల్ మీద మొలకశాతం పరీక్షించిన తేది, విత్తన వాడక సమయాన్ని చూసి కొనుగోలు చేయాలి.

మన రాష్ట్ర వ్యవసాయ శాఖ విత్తన నాణ్యతను పరీక్షించే కిట్లను కొనుగోలు చేసి రైతు భరోసా కేంద్రాలు (ఆర్.బి.కె.)లకు సరఫరా చేసింది. ప్రతి ఆర్.బి.కె.లో ఉండే విత్తన పరీక్షా కిట్ ధర రు.15,329/-లు. రైతులు తమకు కావలసిన విత్తనాల నాణ్యతను ఇటువంటి విలువైన కిట్లను ఉపయోగించి పరీక్షించుకోవచ్చు. వీటిలో విత్తన భౌతిక స్వచ్ఛత, మొలక పరీక్ష, జన్యు స్వచ్ఛత, తేమ శాతం వంటి పరీక్షలు తమ ఉత్పత్తుల అమ్మకానికంటే ముందే రైతులు చేయించుకొని మంచి ధరను పొందే వీలుంటుంది. దీనివలన తమ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను (ఎఫ్.ఏ.క్యూ.) లను రైతులు అందుకునే అవకాశం ఉంటుంది. కావున రైతులు తమకవసరమైన వెనువెంటనే ఆర్.బి.కె.లను సంప్రదించి ఈ విత్తన పరీక్ష కిట్లను ఉపయోగించుకోవచ్చు.



# వేసవిలో నిమ్మ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



డా॥ సి. మధుమతి, డా॥ ఉమామహేశ్వరి, డా॥ కవిత, డా॥ ప్రతాప్, డా॥ రంజిత్ కుమార్,
నిమ్మ, చీనీ పరిశోధన స్థానం, పెట్లూరు, వెంకటగిరి మండలం, నెల్లూరు జిల్లా

దేశంలోనే మన రాష్ట్రం నిమ్మ తోటల సాగులో ప్రథమ స్థానంలో ఉంది. రాష్ట్రంలో నిమ్మ తోటలు 41,225 హెక్టార్లలో సాగవుతున్నాయి.. 6.59 లక్షల టన్నుల పండ్ల దిగుబడిని ఇస్తోంది. నిమ్మ తోటలు నెల్లూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, గుంటూరు, కడప, కర్నూలు, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లాల్లో ఎక్కువగా సాగు అవుతున్నాయి.

వేసవిలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి వనరుల కొరత, చీడపీడల బెడద వల్ల కాయలు రాలిపోవడం, ఎండుపుల్ల పడడం, చెట్లు ఎండిపోవడం వంటి సమస్యల వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వేసవిలో నిమ్మ కాయలకు మంచి ధర పలుకుతుంది. కాబట్టి ఈ సమయంలో నాణ్యమైన కాయ దిగుబడికి తోటల్లోని చెట్లు సంరక్షణ కొరకు సరియైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది.

ప్రస్తుతం నిమ్మ చెట్లు పిందె, కాయ ఎదిగే దశలో ఉంది కనుక ఈ సమయంలో నేలను దున్నడం, పాదులు త్రవ్వడం చేయకూడదు.

కాపు నిలబడగానే చెట్లు వాడిపోకుండా క్రమం తప్పకుండా నీటిని అందిస్తూ ఉండాలి.

నీటిని డ్రిప్ పద్ధతిలో అందిస్తే దాదాపుగా 25 శాతం నీటిని ఆదా చేయడమే కాకుండా చెట్లు వడలిపోకుండా, బంక తెగుళ్ళు, వేరుకుళ్ళు తెగుళ్ళు రాకుండా, ఎండుపుల్ల పడకుండా వేసవిలో చెట్లను కాపాడవచ్చు. నాణ్యమైన కాయ దిగుబడిని





పొందవచ్చును. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు చెట్టుకు 100 లీటర్ల వరకు నీటి అవసరం ఉంటుంది.

చెట్ల పాదులలోని తేమలో ఎక్కువ తక్కువలు, హఠాత్తుగా వాతావరణంలో వచ్చే మార్పులు, హార్మోనుల లోపాల వల్ల కాయలు బాగా ఎదిగి కోతకు వచ్చే సమయంలో పూత, పిందె రాలుడు సమస్య ఉంటుంది.

పూత, పిందె రాలుడు అరికట్టడానికి 2, 4-డి మందును 10 పి.పి.యం. అంటే 1 గ్రాము మందును 100 లీటర్ల నీటిలో లేదా 1 మి.లీ. ప్లానోఫిక్స్ అనే మందును 4.5 లీటర్ల నీటిలో కలిపి, పూత సమయంలో ఒకసారి, పిందె గోళి పరిమాణంలో ఉన్నప్పుడు మరొకసారి మొక్కలపై పిచికారి చేయాలి.

మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కాయ పసుపు రంగు లేదా గోధుమ రంగుకు మారుతుంది. చెట్టులో పడమటి దిక్కుపై కాసిన కాయలపై ఎండ తీవ్రత వల్ల వడలిపోవును. కాయ గట్టిగా ఏర్పడి రసం శాతం తగ్గిపోతుంది. నివారణకు ఒక శాతం యూరియా (10 గ్రా/లీ) ద్రావణాన్ని పిచికారి చేయాలి. తర్వాత 15 రోజులకు, 2 శాతం బట్టీ సున్నం ద్రావణాన్ని (20 గ్రా/లీ) పిచికారి చేయాలి. చెట్టుకు కాపు దశలో నీటి ఎద్దడి కలుగరాదు.

వేరు కుళ్ళు తొలి లక్షణాలు సాధారణంగా ఎండాకాలంలో కనిపిస్తాయి. చెట్లకు సరియైన నీరు అందించినా కూడా కొన్ని చెట్లు వాడిపోయినట్లు ఉంటాయి. వీటి వేర్లను గమనించినట్లయితే వేర్లపైన బెరడు కుళ్లినట్లు ఉంటుంది. కుళ్లిన వేళ్ళు బెరడు పాచిపోయి దుర్వాసన వస్తుంది. తెగులు సోకిన చెట్లలో ఆకులు



ఎర్రగా రంగు మారటం, ఆకులు రాలటం, విపరీతంగా పూత పట్టుట, పిందెలు రాలటం, కాయలు ముదిరే లోపలే చెట్టులోని ఒక కొమ్మగాని, చెట్టు అంతా గాని ఎండిపోతుంది.

తెగులు సోకిన చెట్టుకు, నీరు పెట్టిన మరుసటి రోజే 1 శాతం బోర్డో మిశ్రమం లేదా 0.2 శాతం కార్బండెజిమ్ (2 గ్రా/లీ. నీటికి) మందు ద్రావణం 20 లీ. పాదు అంతా పోయాలి.

తెగులు సోకిన చెట్లపాదుల్లో ఏదో ఒక వ్యవసాయ వ్యర్థపదార్థాలు వరిపొట్టు, వేరుశనగ పొట్టు, ఎండి రాలిన ఆకులు,మినుము/పెసర పొట్టు, రంపపు పొట్టు, భూకవచంలా (ఆచ్ఛేదనంగా) 2-3 అంగుళాల మందంగా వేయాలి. ఈ విధంగా మల్చింగ్ చేయడం వల్ల చెట్ల పాదులో నీరు త్వరగా ఆవిరి కాకుండా ఉంటుంది.

ట్రైకోడెర్మా కల్చరు మిశ్రమ (1 కిలో కల్చరు 90 కిలోల బాగాచివికిన పశువుల ఎరువు 10 కిలోల వేప పిండి) 4-5 రోజులు మగ్గబెట్టి, చెట్టు ఒక్కొంటికి 10 కిలోల చొప్పున పాదులో వేసి కలియబెట్టాలి. మరలా ఆరు నెలల తర్వాత ఇదేవిధంగా చేయాలి. ఆరోగ్యంగా వున్న చెట్లకు ఈ మిశ్రమాన్ని ప్రతి సంవత్సరం 5 కిలోల చొప్పున వేస్తే తెగులు రాకుండా ఉంటుంది.





వేసవిలో చెట్ల మొదలుకు 1 శాతము బోర్డో పేస్టును పూతగా వేయడం వల్ల బంక తెగులు రాకుండా ఉంటుంది.

కాయలు గోళీ పరిమాణంలో ఉన్నపుడు మంగు నల్లి ఆశించకుండా ప్రోపార్గైట్ 57 ఇ.సి. (ఒమైట్) @ 1 మి.లీ. లేదా ఇథియాన్ 50 ఇ.సి. @ 1 మి.లీ. లేదా ఫెన్జాక్విన్ 10 ఇ.సి. @ 1 మి.లీ. లేదా అటామిక్టిన్ 1.9 ఇ.సి. @ 0.4 మి.లీ. లేదా స్పైరోమిసిఫిన్ 24 ఇ.సి. @ 0.8 మి.లీ. లేదా నీటిలో కరిగే గంధకం @ 3 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని గోళీకాయ దశలో ఒకసారి, 20 రోజుల తరువాత రెండవసారి పిచికారి చేయాలి. పిందెలు ఏర్పడిన 2 నెలల తరువాత లేదా కాయ 4 సెం.మీ. వ్యాసార్థము దాటిన తరువాత మందులు పిచికారి చేసినా ఉపయోగం లేదు.

వేసవిలో తెల్లపొలుసు పురుగులు మొదళ్ళపై ఆశిస్తాయి. ఎక్కువగా నిమ్మ చెట్ల కాండంపై వేల సంఖ్యలో ఆశించి సున్నం పూసినట్లుగా కనబడతాయి. రసాన్ని పీల్చి, కొమ్మలు, ఎండి, ఎక్కువగా ఉన్నప్పుడు చెట్లు ఎండిపోతాయి.

నివారణకు కాండాన్ని, కొమ్మలను గోనె పట్టతో రుద్ది, డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి కాండం కొమ్మలపై పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు మినరల్ ఆయిల్ లేదా పెట్రోలియం స్ప్రే ఆయిల్ (ఆగ్రో స్ప్రే ఆయిల్) @ 10 మి.లీ. + బుప్రోఫెజిన్ 25 యస్.సి @ 2 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

వేసవి కాలంలో తామర పురుగులు పూత, కాయలను ఆశించి రసం పీల్చడం వల్ల తెల్లని వలయాకారంలో మచ్చలు ఏర్పడి కాయలకు మార్కెటు లేకుండా పోతుంది. నివారణకు స్పైనోసాడ్ 45 యస్.పి @ 2 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పిండి పురుగు తెల్లని మైనపు పదార్థంతో కప్పబడి లేత కొమ్మల మీద కాయల మీద చేరి రసం పీల్చడం వల్ల పూత, పిందె రాలిపోతుంది. నివారణకు డైమిథోయేట్ 30 ఇ.సి. @ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

నిమ్మలో పురుగు మందులు వాడే ముందు వేప నూనె (అజాడిరాక్టిన్)ను 10,000 పి.పి.యం @ 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసిన వారం రోజుల తరువాత పురుగు మందులను పిచికారి చేయాలి.

వేసవిలో కాయ సైజు రసం శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి పొటాషియం నైట్రేట్ 10 గ్రా/లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని కాయలు గోళీకాయ సైజు తరువాత పిచికారి చేయాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వేసవిలో సిరుల పంట - మల్లె



డా॥ పి. లలిత కామేశ్వరి, సీనియర్ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన్ కేంద్రం, పందిరిమామిడి, తూర్పుగోదావరి జిల్లా,
డా॥ బి. శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం,
డా॥ ఆర్.వి.ఎస్కె. రెడ్డి, పరిశోధన సంచాలకులు, డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం.



మన రాష్ట్రంలో వాణిజ్య పరంగా సాగు చేస్తున్న పూల పంటల్లో మల్లె ప్రధానమైనది. మల్లెపూలను సాధారణంగా దండలు, పుష్పగుచ్చాల తయారీకే గాక విడిపూలుగా కూడా వాడతారు. మల్లెలో సుమారు 3-4 జాతులు వాణిజ్యపరంగా సాగుచేస్తున్నా, ప్రస్తుత సీజను గుండుమల్లె సాగుకు ఎక్కువ అనుకూలం. దీనిని బొడ్డు మల్లె అనికూడా అంటారు.

ముఖ్యగా జనవరి, ఫిబ్రవరి మాసాలలో రైతులు కొన్ని జాగ్రత్తలు, సూచనలు పాటిస్తే పూల నాణ్యతతో పాటు దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది.

**ఎరువులు :** ఒకసారి నాటిన మొక్కలు 12-15 సం॥ వరకు అలాగే ఉండి ప్రతి సంవత్సరం దిగుబడినిస్తూ ఉంటాయి. కాబట్టిమొక్కలు ఎక్కువగా ఆరోగ్యవంతంగా ఉండి అధిక దిగుబడులు సాధించడానికి మొక్కల పోషణ చాలా అవసరం. మల్లె మొక్కలు ఎరువుల వాడకానికి బాగా ప్రతిస్పందిస్తాయి. అవసరానికి మించిఎక్కువ ఎరువులు అందించినట్లయితే మొక్కలు శాఖీయంగా బాగా పెరిగి పూల ఉత్పత్తి తగ్గిపోతుంది. గుండుమల్లెలో సంవత్సరంలో ఒకసారి ఒక్కొక్క మొక్కకు 10 కిలోల సేంద్రియ ఎరువు వేయాలి. అంతేగాక మొక్కకు 90 గ్రా॥ నత్రజని, 120 గ్రా॥ భాస్వరం, 240 గ్రా॥ పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా జూన్-జూలై మాసాలలో ఒకసారి వేసినట్లయితే పూలు త్వరగా రావటానికి అవకాశం ఉంది.

**కత్తిరింపులు :** మల్లెలో పూలు లేత చిగురు నుండే ఏర్పడతాయి. కావున కొమ్మ కత్తిరింపులు చేసినట్లయితే శాఖీయ పెరుగుదల నియంత్రించి పూమొగ్గలు ఏర్పడటానికి దోహదపడుతుంది. కత్తిరింపులకు 15 రోజుల ముందు మొక్కకు నీరు ఇవ్వకూడదు. గుండుమల్లెలో 30-40 సెం.మీ. ఎత్తులో కత్తిరింపులు చేపడితే ఎక్కువగా కొత్త చిగుర్లు, రెమ్మలు వస్తాయి. గత సంవత్సరం పూల కొమ్మలను, తెగులు సోకిన కొమ్మలను కత్తిరించి తీసివేయాలి. కత్తిరించిన వెంటనే కొమ్మచివర్లను రాగి ధాతు సంబంధిత శిలీంద్రనాశినితో శుద్ధి చేసి రోగాలు రాకుండా చూడాలి. ఆ తరువాత ఆకులను కూడా తీసివేయాలి. ఎంత వరకు కత్తిరింపులు చేపట్టాలి అనేది రకము, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. గుండుమల్లెలో డిసెంబరు



నుండి జనవరి వరకు కత్తిరింపులు చేపట్టినట్లయితే అధిక దిగుబడి వస్తుంది. పొలం అంతా ఒకేసారి కత్తిరించకుండా దఫ దఫాలుగా చేసినట్లయితే ఎక్కువ రోజులు పూలు పొందటానికి అవకాశం ఉంటుంది. కానీ జనవరి నెలలో చేసిన కత్తిరింపుల వల్ల పూల దిగుబడి మరియు నాణ్యత కూడా తగ్గుతుంది.

**హార్మోనుల వాడకం :** శాఖీయ దశలో 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు సైకోసిల్ అనే రసాయనాన్ని 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా మల్లెలో పూల దిగుబడి,



నాణ్యత పెంచవచ్చు. అలాగే 20 పి.పి.యమ్. ప్లానోఫిక్స్ కత్తిరింపులు చేసిన 10 రోజుల తర్వాత పిచికారి చేసి మంచి దిగుబడి పొందవచ్చు.

**కోత :** మల్లెలో మంచి దిగుబడిని పూత మొదలైన రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం నుండి మాత్రమే పొందగలము. తాజా పూల కొరకు ఉదయం 8 గంటలలోపు లేదా సాయంత్రం 4 గంటల తరువాత కోయాలి. ఆలస్యం చేస్తే నాణ్యత తగ్గిపోతుంది. సాధారణంగా రైతులు గోనెసంచులలో పూలను



నింపి మార్కెట్‌కు సరఫరా చేస్తారు. దూర ప్రాంతాలకు రవాణా చేసేటప్పుడు, కొద్దిగా గాలి ప్రవహించే విధంగా చేసి తేమ ఉండేలా చూడాలి. బుట్ట అడుగుభాగంలోను, పై భాగంలోను కాగితాలను తడిపి వేయాలి.

## సస్యరక్షణ :



**మొగ్గ తొలిచే పురుగు :** మల్లె తోటలలో ఉష్ణోగ్రత పెరిగేకొద్ది మొగ్గతొలుచు పురుగు తాకిడి ఎక్కువగా ఉంటుంది. తల్లి పురుగు మొగ్గలపై గుడ్లు పెడుతుంది. గ్రుడ్ల నుంచి వచ్చిన గొంగళిపురుగు మొగ్గల్ని తొలచి తింటాయి. ఈ మొగ్గలు మొదట గులాబి రంగుకు మారి తరువాత ముడుచుకొని ఎండిపోతాయి. మొగ్గల్లో బూజులాగా ఏర్పడుతుంది. నివారణకు తోటల్లో కొమ్మలు, రెమ్మలు కత్తిరించి, ఆకులను దూసి, పాదుల మధ్య బాగా తవ్వాలి, రంగుమారి రాలిపోతున్న మొగ్గల్ని తగులబెట్టాలి. ఒక్కో సాగుకి 20-30 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి నీరు పెట్టాలి. లేదా ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లేదా డైక్లోరోవాస్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



**ఇరియోఫిడ్ నల్లి :** లేత ఆకులు, కొమ్మలు మీద బుడిపెలుగా ఏర్పడి ఆకు అంతా వ్యాపించి తద్వారా దిగుబడి బాగా తగ్గుతుంది. కొమ్మ కత్తిరింపులు చేసేటప్పుడు పనిముట్ల ద్వారా ఒక మొక్క నుంచి ఇంకొక మొక్కకు వ్యాపిస్తుంది. నివారణకు ఎబామెక్టిన్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఎండు తెగులు :** మల్లెలో ఎండు తెగులు కూడా ఎక్కువగా వస్తుంది. తెగులు సోకిన మొక్కల దగ్గర కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి మొక్క మొదలు ముంపుగా తడపాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# పెరటి కోళ్ళ పెంపకం



విస్తరణ విభాగం,
శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం, తిరుపతి

మన దేశంలో కోళ్ళ పరిశ్రమ చాలా అభివృద్ధి చెందినప్పటికీ గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజానీకానికి కోడిగుడ్లు, మాంసము అందుబాటులో లేవు. పేద ప్రజలకు సమతుల ఆహారం ఇవ్వాలంటే, వారికి చౌకగా దొరికే కోడిగుడ్లు, కోడి మాంసం తప్పక అందుబాటులోకి రావాలి. పెరటిలో కోళ్ళ పెంపకం ఇంటిల్లిపాదికి సమతుల ఆహారం అందివ్వడంతో పాటు, అదనపు ఆదాయం ఇవ్వగలదు. ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పెరటిలో కోళ్ళ పెంపకానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. 6-8 వారాల వరకు కోడి పిల్లలను పెంచుకొనే విధానం తెలుసుకుందాం.

## కోడి పిల్లల పెంపకంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు :

### షెడ్డు నిర్మాణం :

కోళ్ళ షెడ్డు నిర్మాణాన్ని ఎత్తయిన ప్రదేశాన్ని ఎంచుకోవాలి. గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరిస్తూ ఉండాలి. కలుషితం కాని మంచి నీరు అన్ని వేళలా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. విద్యుత్ రవాణా సౌకర్యం అందుబాటులో ఉండాలి. ఈ షెడ్డు తూర్పు - పడమర దిశలలో నిర్మించాలి. అందువల్ల సూర్యరశ్మి, వర్షం నేరుగా షెడ్‌లో పడకుండా ఉంటుంది. షెడ్ పక్క గోడలను రెండు అడుగుల వరకు ఇటుకతో నిర్మించి పైన ఇనుప జాలి 6 అడుగుల ఎత్తు వరకు పెట్టాలి. షెడ్డు చూరు మూడు అడుగుల వరకు బయటకు వచ్చేలా నిర్మించాలి. అలా నిర్మించడం వల్ల వర్షపు జల్లు షెడ్‌లో పడకుండా ఉంటుంది. షెడ్ ముఖద్వారం దగ్గర ఒక అంగుళం లోతు ఉండునట్లు పళ్ళెం ఏర్పాటు చేసి ఫినాయిల్ కలిపిన నీరు ఉంచాలి. షెడ్డు లోపలకు పోయే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఫినాయిల్ నీటిలో కాళ్లు ముంచి వెళ్ళాలి. తద్వారా రోగకారక క్రిములు షెడ్‌లో ప్రవేశించకుండా చూడవచ్చు. కోడి పిల్లల షెడ్‌లోనికి ఇతరులను నిషేధించాలి.

### కోడి పిల్లలకు కావలసిన పరికరాలు :

చిక్ గార్డ్స్, మేతతొట్లు, బ్రూడర్ హోపర్, మేతకు ఉపయోగించు గరిటెలు తగినన్ని అందుబాటులో ఉండాలి.

### మొదటి ఆరు వారాలలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు :

చిన్న పిల్లల పెంపకంలో మొదటి ఆరు వారాలు చాలా కీలకమైనవి. ఈ సమయంలో కోడి పిల్ల తన శరీర ఉష్ణోగ్రతను తనకు తానుగా నియంత్రించుకోలేదు. కావున తగిన ఏర్పాట్లు చెయ్యాలి.

షెడ్ చుట్టుపక్కల కనీసం 5 అడుగుల వరకూ ఎలాంటి పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలి. షెడ్ లోపల బూజు ఇతర వ్యర్థ పదార్థములను కాల్చివేయాలి. నీరు, దాణా పరికరాలు, బ్రూడర్స్, చిక్ గార్డ్‌లను వాషింగ్ సోడాతో శుభ్రం చేసిన తర్వాత క్రిమిసంహారక ద్రావణంలో ముంచి, ఎండలో ఆరబెట్టాలి. తర్వాత వాడాలి. షెడ్ లోపల క్రిమిసంహారక ద్రావణం స్ప్రే చేసి ఒక వారం రోజులపాటు కోళ్ళు లేకుండా షెడ్‌ను ఖాళీగా ఉంచాలి. లిట్టర్‌ను (వరిపొట్టు / రంపపు పొట్టు) నేల మీద 2-3 అంగుళాల ఎత్తు ఉండేటట్లు పరచాలి. లిట్టర్ మీద పాత వార్తా పత్రికలను పరచాలి. ఆ తరువాత చిక్‌గార్డ్‌ను, బ్రూడర్స్‌ను అమర్చుకోవాలి. కోడి పిల్లలు రావటానికి ఒక రోజు ముందు బ్రూడర్ షెడ్లను పోటాషియం పర్మాంగనేట్, ఫార్మలిన్ కలిపి ఫ్యూమిగేషన్ (పొగ) వేయాలి. కోడిపిల్లలు వచ్చే కొద్ది గంటల ముందు బ్రూడర్‌లోని విద్యుత్ బల్బులను వేసి తగినంత ఉష్ణోగ్రత ఉండేటట్లు చూసుకోవాలి. అదే విధముగా నీటి తొట్టెలను శుభ్రమైన నీటితో నింపాలి.

ప్రతి కోడి పిల్లకు ఉష్ణోగ్రతను మొదటి వారం 95 డిగ్రీల ఫారన్ హీట్ కల్పించి ఆ తరువాత ప్రతి వారం 5 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గిస్తూ 3-4 వారాల వరకు ఏర్పాటు చేయాలి. కోడిపిల్లల షెడ్‌లో ఉష్ణోగ్రత సరిగ్గా ఉన్నది లేనిది కోడి పిల్లల ఉనికిని బట్టి చెప్పవచ్చు. బ్రూడర్ ప్రదేశంలో తగినంత ఉష్ణోగ్రత ఉన్నప్పుడు కోడి పిల్లలు సమానంగా విస్తరించి ఉంటాయి. ఎక్కువ వేడి ఉ

న్నప్పుడు బ్రూడర్ బయట గుమిగూడతాయి. ఉష్ణోగ్రత తగ్గినపుడు అన్ని బ్రూడర్ క్రింద గుమిగూడతాయి.

వేసవిలో వాతావరణ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు బ్రూడర్స్ ఉంచే కాలాన్ని తగ్గించవచ్చు. ఒక మీటర్ వ్యాసార్థం గల బ్రూడర్ క్రింద 250 - 300 కోడి పిల్లలను పెంచవచ్చు.

కోడి పిల్లలు బ్రూడర్ నుండి దూరంగా పోకుండా ఉండటానికి బ్రూడర్ చుట్టు చిక్ గార్డులను ఏర్పాటు చేయాలి. ఈ చిక్ గార్డులను అట్టముక్కలతో గాని ఇనుప రేకులతో గాని చెక్కతో గాని తయారు చేసుకోవచ్చు. వీటి ఎత్తు 15-18 అంగుళాలు ఉండేటట్లు చూసుకొని బ్రూడర్ అంచు నుండి అడుగు దూరం ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి.

గ్లూకోజ్ / ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీటిని కోడి పిల్లలు రాగానే తాగేలా చూడాలి.

## గాలి, వెలుతురు :

స్వచ్ఛమైన గాలి ఎల్లప్పుడు వీస్తూ ఉండాలి. దీనివల్ల కోళ్ళకు హాని కల్గించే వాయువులు, అమ్మోనియా షెడ్ నుండి బయటకు పోతాయి. అలాగే వెలుతురు నిరంతరం ఉండాలి. వెలుతురు కోడి పిల్లల పెరుగుదలకు చాలా తోడ్పడుతుంది.

## లిట్టర్ యాజమాన్యం :

లిట్టర్ కోసము ప్రస్తుతము వరి పొట్టును విరివిగా వాడుతున్నారు. మొదట నేలమీద 2 నుండి 3 అంగుళముల వరకు వరి పొట్టును పరిచి 4 నుడి 5 రోజుల కొకసారి లిట్టర్ గడ్డ కట్టకుండా కలియబెట్టాలి. ఏవైనా కారణములచేత లిట్టర్ తడిసిన యెడల తీసివేయవలెను. అమ్మోనియా వాసన ఎక్కువగా ఉన్నప్పుడు సున్నం లేదా సూపర్ ఫాస్ఫేట్ 7-10 కేజీలు ప్రతి 100 చదరపు అడుగుల విస్తీర్ణానికి కలపాలి. ప్రతినెల కొద్ది పరిమాణంలో వరిపొట్టును అదనంగా కలుపుతూ ఉండాలి.

## నీరు మరియు మేత :

నీటి, దాణా పరికరాలను / నీటి తొట్లను బ్రూడర్ చుట్టు చక్రాకారంలో అమర్చాలి. కోళ్లలో జీవక్రియలకు నీరు మూలాధారం. ఎప్పుడూ శుభ్రమైన నీరు అందించాలి. 50 కోడి పిల్లలకు ఒకటి చొప్పున నీటి తొట్లను ఏర్పాటు చేయాలి.

దాణాను సరియైన మోతాదులో రోజుకు 2-3 సార్లు అందించాలి. కోడి పిల్లలకు సమీకృత దాణాను అందించాలి.

## ఆరోగ్య పరిరక్షణ :

తగిన సమయంలో టీకాలు, మందుల వాడకంలో కోడి పిల్లల ఆరోగ్య పరిరక్షణ చేసుకోవాలి.

పెరటిలో పెరిగే కోళ్ళు వివిధ అపరిశుభ్రమైన ప్రదేశాలలో తిరగడం వలన తొందరగా వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. కావున టీకాలు ఇప్పించిన కోడి పిల్లలనే కొనుక్కోవాలి. టీకాలు ఇచ్చేటప్పుడు క్రింది జాగ్రత్తలు పాటించాలి.

- టీకాలు వేసేటపుడు ఒత్తిడికి గురికాకుండా చూడాలి.
- ఆరోగ్యమైన వాటికి మాత్రమే టీకాలు వేయాలి.
- ఎక్కువ ఎండ (లేదా) చలిలో కాని టీకాలు వేయకూడదు.
- టీకాలు వేసిన తరువాత ఆ రోజు కాని తరువాత రోజు కాని ఒత్తిడికి గురిచేసే మందులు, ఉదాహరణకు యాంటిబయాటిక్స్ వాడకూడదు.
- టీకా ఇచ్చే ముందు 2 రోజులు ఇచ్చిన తరువాత 2 రోజులు విటమిన్లు నీటిలో కలిపి ఇవ్వాలి.
- టీకా మందు కలిపిన 2 గంటలలోపు వాడాలి.
- మిగిలిన మందు మరియు ఖాళీ సీసాలను దూరంగా పూడ్చి పెట్టాలి.
- రెండు టీకాలకు మధ్య వ్యవధి ఒక వారం రోజులు ఉండాలి.

## కోళ్ళలో టీకాల పట్టిక :

| క్ర.సం. | వ్యాధి | వయస్సు | ఇచ్చే పద్ధతి |
|---|---|---|---|
| 1. | మారెక్స్ టీకా | 1వ రోజు | చర్మం ద్వారా |
| 2. | లసోటా టీకా | 7వ రోజు | కంటి చుక్క |
| 3. | గంబోరా టీకా | 14వ రోజు | కంటి చుక్క |
| 4. | గంబోరా టీకా (బూస్టర్) | 24వ రోజు | కంటి చుక్క |
| 5. | లసోటా టీకా (బూస్టర్) | 28వ రోజు | కంటి చుక్క |
| 6. | అమ్మతల్లి టీకా | 36వ రోజు | కండలో సూది |
| 7. | కొక్కెర వ్యాధి టీకా | 6వ వారం | కండలో సూది |

## పెరటి కోళ్ళలో వచ్చే ముఖ్యమైన వ్యాధులు, నివారణ:

కోళ్ళ పెంపకం, మాంసపు జాతి కోళ్ళ పెంపకం శీర్షికలో పొందుపరిచినటువంటి వ్యాధులు ఈ పెరటికోళ్ళలో కూడా సోకే అవకాశం ఉన్నందున ఆయా శీర్షికలలో పేర్కొనబడిన నివారణ చర్యలను పాటించాలి.





# పశువులకు ఎండ దెబ్బ నివారణ జాగ్రత్తలు



డాక్టర్. జి.రాంబాబు, పశువైద్యాధికారి, కడప.



వడదెబ్బ, దీనిని ఎండదెబ్బ అని కూడా అంటారు ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైన కారణంగా శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమయి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడడం చాలా వేడియైన వాతావరణం లేదా చురుకైన పనుల వలన కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలు, శరీరం యొక్క ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తాయి. వేడికి సంబంధించిన సమస్యలలో వడదెబ్బ చాలా తీవ్రమైనది. ఇది తరచుగా, వ్యాయామం నుండి లేదా వేడి వాతావరణంలో, సరియైన మోతాదులో ద్రవ పదార్థాలని తీసుకోకుండా బరువైన పనిని చేసినప్పుడు కలుగుతుంది.

### 1. పశువుల తిండి తినే సమయాలను మార్చడము :

ప్రొద్దున్నే అనగా ఉదయం 10 గంటలలోపు, సాయంత్రము 4 గంటల తరువాత మాత్రమే మేత సమయాలను పాటించాలి. అనగా చల్లని వాతావరణ సమయాలను ఎంచుకోవాలి. ఇంకా పొడి పదార్థాలు అనగా దాణా, చెక్క, వట్టి గడ్డి శనక్కాయల కట్టలు పెట్టడము వలన శరీరములో వేడి పెరుగుతుంది. అందువలన వాటిని కొంతమేర తగ్గించాలి.

### 2. రోజువారి దాణాను మార్చడము :

అనగా మనము శరీములోని వేడిని తగ్గించడానికి పొడి పదార్థాలు తగ్గిస్తున్నాము. దానికి సమతుల్యమయిన ఆహారము అనగా ముడి కర్బన పదార్థాలు, బైపాస్ ప్రొటీనులు, పోషక విలువలుండే ఆహారాన్ని పశువులకు అందించాలి.

### 3. పొటాషియం మోతాదును ఆహారములో పెంచడము :

పశువులకు అందించే మేత లేదా దాణాలో పొటాషియం, సోడియం మోతాదును పెంచాలి. ఎందుకంటే చెమట, మూత్ర విసర్జన ద్వారా ఈ మూలకాలు బయటకు వెళతాయి. దీనికోసమని ఉప్పును కలపడము లేదా ఉప్పు రాళ్ళను వాడకము వలన ఉపయోగము ఉంటుంది.

### 4. తాగునీటిని పెంచడము :



ఇది అత్యంత ముఖ్యమయిన పని. పశువులు మేత తిని వచ్చే దారిలో వాకిట దగ్గర, చెట్ల క్రింద, వాటి పశుశాలలో తొట్టెలను ఏర్పాటు చేసి పరిశుభ్రమయిన నీటిని అందించాలి.

5. మేతను గాని లేదా దాణాను గాని ఒకేసారి ఎక్కువ మోతాదులో ఇవ్వడము చేయకూడదు. అలా ఇచ్చినపుడు పొట్టలో ఎక్కువగా వేడి వచ్చి పశువులు ఇబ్బంది పడతాయి. రోజులో 4-5 సార్లు సరఫరా చేస్తే శరీరం లోపల ఉష్ణోగ్రత పెరగకుండా ఉంటుంది.

6. 13-14 అడుగుల ఎత్తు ఉన్నటువంటి కొబ్బరి పీచుతో చేసిన లేదా అట్టలను గాని నీడ మరియు గాలి తగిలేటట్లు ఏర్పాటు చేయాలి.

7. విదేశీ పశు జాతులకు నీళ్ళలో అదనంగా పోషకాలు, మూలకాలను, ఒత్తిడిని తగ్గించే ఫైటోకాల్ లేదా రేస్టోబాల్ హోమియోపతి ద్రావణాలను నీటిలో కలపాలి.

“సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి”

8. అలాగే ఆవులలో తీవ్ర ఉష్ణోగ్రత కనిపించినపుడు అయోడిన్ సూది మందును వాడాలి. అది అవటు గ్రంధిపై పనిచేసి థర్మో రెగ్యులేటర్ పనిని ఉత్తేజ పరుస్తుంది.

9. ఎండాకాలములో ముఖ్యంగా వట్టిగడ్డికి బదులు సైలేజి/పాతర గడ్డి లేదా పచ్చగడ్డిలో అధికముగా పోషక విలువలు ఉండే గడ్డిజాతులను పశువులకు అందించాలి.

10. పాలిచ్చే పశువులలో రోజుకి ఆహారాన్ని 20 కేజీలకు మించకుండా చూసుకోవాలి.

11. ప్రతి రెండు గంటలకు ఒకసారి పది లీటర్ల నీటిని అందించాలి.

12. నార గోతాలను 2/3 గంటలకు ఒకసారి తడిపి పశువుల శరీరముపై వేస్తూ ఉండాలి.

13. రెండు రోజులకొకసారి 250 గ్రాముల గ్లూకోస్‌ను, ఓ.ఆర్.యస్. ఎలెక్ట్రోలైట్ పౌడర్‌లను నీటిలో అందించాలి.

14. గేదెల చర్మము నలుపు రంగులో ఉండడము వలన ఎక్కువ వేడిని పీల్చుకుంటాయి. దానివలన శరీరము త్వరగా వేడెక్కుతుంది. వేడి ఎక్కువయినపుడు అవి నీటి గుంతలకు వెళ్లి పడుకుంటాయి. ముఖ్యంగా గేదెలలో ఈ లక్షణం ఉంటుంది. దాన్ని వాల్లోయింగ్ అంటారు. ఆ సమయాన్ని ఉదయం 11.30 గంటలకు సాయంత్రం 3.30 గంటలకు రెండు సార్లు పంపవలెను.

15. పశువుల కేంద్రాలలో నీటిని వెదజల్లే యంత్రాలను, ఫ్యాన్లను అమర్చి శరీర ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు.

16. ఎండాకాలములో గేదెలు మూగ ఎదకు ఉంటాయి. అందువలన ఎదను జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి మరియు పోషక ఆహారాన్ని అందించాలి.





17. డైరీ ఫారంలలో ఉన్నవాళ్ళు ముందస్తు జాగ్రత్తగా పెద్ద చెట్లను చుట్టుప్రక్కల నాటడము వలన తేమ శాతాన్ని తగ్గించి, గాలిని నీడను అందజేస్తాయి.

## 18. పనికి తీసుకెళ్ళే ఎద్దులను గుర్తించడము ఎలా?

తిండి, నీరు తాగడానికి సహకరించకపోవడము, మంద కొండిగా ఉండడము, నీడను కోరుతూ ఉండడము, నీటి తొట్టెల దగ్గరగా ఉండడము, నోటి నుండి స్రావాలు కారుతూ ఉంటాయి, నాలుక బయట పెట్టడము, కొంచెము ఊగుతూ ఉండడము, రొమ్ము వెనుక భాగము కొన్ని పశువుల్లో ఎరుపుగా మారును, శ్వాస తీసుకునే రేటు ఎక్కువగా ఉంటుంది, గుండె / నాడి కొట్టుకోవడం, వేగంగా / తక్కువగా శ్వాస తీసుకోవడం, ఎక్కువ లేదా తక్కువ రక్తపోటు

చర్మం స్వేదాన్ని ఇక స్రవించలేని పరిస్థితికి రావడం, తలనొప్పి, వికారం, కండరాలు పట్టేయడం, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. వడదెబ్బ తీవ్రత గుర్తించిక సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు.

## వడదెబ్బ తగిలిన పశువులకు చికిత్స

పండిన చింతకాయలను నీటిలో పిసికి ఆ రసంలో ఉప్పు కలిపి తాగించాలి. చల్లటి మంచినీటిలో నిమ్మరసం, ఉప్పు కలిపి మాటిమాటికీ త్రాగిస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రైటోకూల్ అనే లిక్విడ్‌ను పెద్ద వాటికి అయితే 50 మిల్లిల, చిన్నవాటికి అయితే 10 మిల్లిలీటర్లను త్రాగించాలి.

ఆమ్ పన్నా.. అనేది మార్కెట్‌లో దొరుకుతుంది. దీన్ని మామిడికాయలతో చేస్తారు. ఇందులో జీరా, మిరియాలు వంటి శరీరాన్ని కూల్ చేసే గుణాలున్న మూలికలు ఉంటాయి. కాబట్టి వడదెబ్బ తగిలిన వాటికి ఆమ్ పన్నా తీసుకోవడం వల్ల త్వరిత ఉపశమనం కలుగుతుంది.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వన్నమయి రొయ్యల పెంపకంలో చెరువుల తయారీ, రొయ్య పిల్లల ఎంపిక



డా. ఎ. శ్రీనివాస్, మత్స్య శాస్త్రవేత్త, కె.వి.కె., ఉండి, డా. ఎన్. మల్లిఖార్జునరావు, సి.పి., డా. ఎం.వి. కృష్ణాజి, విస్తరణ శాస్త్రవేత్త, కె.వి.కె. ఉండి.



వన్నమయి రొయ్యలను విదేశాల నుంచి వ్యాధి నిరోధకత కలిగినవి తల్లి రొయ్యలను దిగుమతి చేసికొని, అన్ని పరీక్షలు నిర్వహించి హేచరీలకు సరఫరా చెయ్యటం జరుగుతుంది. కావున వన్నమయి రొయ్య పిల్లలను ధృవీకరించిన హేచరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. వన్నమయి రొయ్యలకు ఏ విధమైన వ్యాధులు రావని అపోహ పడుతుంటారు. కాని ఈ రొయ్యలను కూడా చెరువు తయారీ నుంచే జాగ్రత్తగా పెంచాలి. లేని యెడల నష్టాల బారిన పడతారు. వన్నమయి రొయ్యలు సలైనిటీ 0.5 పి.పి.ఎం. నుంచి 50 పి.పి.ఎం. వరకు తట్టుకుంటాయి. కానీ 5 పిపిటి నుంచి 25 పిపిటి సలైనిటీ కలిగిన నీటిలో పెంచిన లాభదాయకం. ఈ రొయ్యలను అధిక సాంద్రతలోనూ పెంచవచ్చు. మన ప్రాంతములో వన్నమయి రొయ్యలను ఎక్కువగా తక్కువ ఉప్పందనము కలిగిన నీటిలో పెంపకం జరుగుతుంది. కావున వన్నమయి రొయ్యల పెంపకంలో కొన్ని ముఖ్యమైన సూచనలు :



- హేచరీల నుంచి రొయ్య పిల్లలను సేకరించినప్పుడు చెరువు నీటిని ఉప్పదనం సమానంగా ఉండేటట్లు చూసుకోవాలి.
- చెరువు అడుగు భాగాన్ని పరిశీలించి, సున్నము, బ్లీచింగ్ పౌడర్ వంటివి వాడి పూర్తిగాఎండబెట్టిన తరువాత నీటిని నింపుకొని తయారు చేసుకోవాలి.
- చెరువు చుట్టూ వల ఫెన్సింగ్, చెరువుపైన పక్షులు రాకుండా వలను ఏర్పాటు చేసుకోవాలి.
- అవకాశం ఉంటే ఒక చిన్న చెరువును 'రిజర్వాయర్' ట్యాంకుగా చేసుకుని అందులో ముందు నీటిని తోడుకొని బ్లీచింగ్ పౌడర్‌లో (30–50 పి.పి.యం.) శుభ్రపరచి తరువాత చెరువులోనికి తోడుకోవాలి.
- చెరువు నీటి ఉప్పదనాన్ని స్థిరీకరించుకుని పెంపక కాలమంతా నీటి ఉప్పదనం (సెలైనిటీ) ఒకేవిధంగా ఉండేటట్లు యాజమాన్యం చెయ్యాలి. ఉప్పందనం తేడా ఎప్పుడు 3 పిపిఎంకి మించరాదు.
- చెరువులో నీటిని కనీసం 6' అడుగుల వరకు నింపుకోవాలి.
- బ్లీచింగ్ పౌడర్‌తో (30–50 పి.పి.యం.) క్లోరినేషన్ చేసిన నాలుగు రోజుల తరువాత ప్రోబయాటిక్ మీడియా అనగా బెల్లం, తవుడు, ఈస్ట్ కలిపిన ద్రావణాన్ని చల్లుకోవాలి.



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



- (ఎకరానికి 10–20 కేజీల తవుడు, 4 కేజీల బెల్లం మరియు 100 గ్రాముల ఈస్ట్), ఒకరోజు తరువాత ప్రోబయోటిక్ చెరువులో చల్లుకోవాలి.
- రెండు రోజుల తరువాత మినరల్స్ చల్లుకోవాలి. మరలా రెండు రోజుల తరువాత ప్రీబయోటిక్ మీడియా రెండవ దఫా చల్లుకోవాలి.

ఆ తరువాత నీటి గుణాలని పరీక్షించి చెరువులో రొయ్యపిల్లలని వదులుకోవాలి.

| | |
|---|---|
| పి.హెచ్. | 7.7 – 8.1 |
| ఆక్సిజన్ | 2 పి.పి.యం. కన్నా ఎక్కువ |
| ఆల్కలనిటీ | 100 – 200 పి.పి.యం. |
| హార్డ్‌నెస్ | 1000 పి.పి.యం. కంటె ఎక్కువ |
| అమ్మోనియా | 0.1 పి.పి.యం. కన్నా తక్కువ |
| ఎల్లో కోలనీలు | < 300 cfu/ml |
| గ్రీన్ కోలనీలు | < 30 cfu/ml |
| కాల్షియం : మెగ్నీషియం | 1:2 – 1:3 |
| మెగ్నీషియం కనీసం 350 పి.పి.యం. ఉండాలి. | |

## రొయ్య పిల్లల ఎంపిక :

- రొయ్య పిల్లల శరీరంపై ఏ విధమైన గోధుమ లేదా నల్లటి మచ్చలు ఉండరాదు.
- మొప్పలు శుభ్రంగాను, పారదర్శకంగాను ఉండాలి.
- రొయ్య పిల్లలు నిటారుగా నీటి ప్రవాహానికి ఈదే స్వభావం కలిగి ఉండాలి. బాగా యాక్టివ్‌గా ఉండాలి.
- రొయ్య పిల్లలు వంకరగా, బెండులుగా, గుంపులుగా మధ్యలో ఉండకూడదు.
- రొయ్య పిల్ల సైజు కనీసం 18 మి.మీ. ఉండాలి. రొయ్య పిల్లలన్నీ ఒకే సైజులో ఉండాలి.
- ఆహారనాళం నిండుగా ఉండి గోధుమ రంగులో లేదా గోధుమ, ఆకుపచ్చ రంగులో ఉండాలి.
- నలుపు రంగు ఖాళీగా ఉండరాదు.
- రొయ్య పిల్లల సంఖ్యను మరీ ఎక్కువగా కాకుండా ఎకరానికి 1 లక్ష వరకు వేసుకుంటే మంచిది. చెరువు సామర్థ్యాన్ని బట్టి నిర్ధారించుకోవాలి.



- చెరువులో రొయ్య పిల్లల సాంద్రతను బట్టి సుమారు 400 కిలోల రొయ్య బరువుకు 1 హెచ్.పి. ఏరియెటేర్ తప్పనిసరిగా అమర్చాలి.
- తక్కువ ఉప్పదనం నీటిలో పెంపకం సాగిస్తున్నప్పుడు ప్రతి 15 రోజుల కొకసారి ఎకరానికి 10 – 20 కేజీల పొటాష్, 20 కేజీల సాధారణ ఉప్పు, 5–10 కేజీల మెగ్నీషియం సల్ఫేట్ 10 కేజీల మినరల్ మిక్చర్ వాడటం ఉపయోగకరంగా ఉంటుంది.
- చెరువు నీటిలో వాడే ప్రోబయోటిక్‌ని మరియు మేతలో వాడే ప్రోబయోటిక్‌ని పేరున్న కంపునీవి ఎంపిక చేసుకొని క్రమంగా వాడటం మంచిది.
- రొయ్యలను చెరువులో విడుదల చేసిన రోజు నుంచి మేతను తగినంత ఇవ్వాలి. మొదటి 5 రోజులు రొయ్య పిల్లల సంఖ్యను బట్టి చాలినంత మేతను ఇచ్చి తరువాత వాటి ఆహారనాళంను పరిశీలించి నిండుగా ఉండేటట్లు చూసి మేత వినియోగాన్ని లెక్కకట్టి మేత పరిమాణాన్ని మేత ఇచ్చే పద్ధతిని నిర్ధారించుకోవాలి.
- తరువాత ఎకరానికి సుమారు 4 చెక్ ట్రేలను ఏర్పరచుకొని మేత యాజమాన్యం చెయ్యాలి.
- ప్రతి 15 రోజులకు రొయ్యల శాంప్లింగ్ చేసి వాటిని ఆరోగ్యాన్ని గమనించి అనుమానం ఉన్నట్లయితే నిపుణుల సలహా తీసుకోవాలి.
- ప్రతి రోజు ఉదయాన్నే చెరువు దగ్గరే పి.హెచ్., ఆక్సిజన్‌ని పరీక్షించుకొని, పి.హెచ్. 7.5 – 8.5 మధ్య ఆక్సిజన్ 4 పి.పి.యం.కి మించి ఉండేటట్లు యాజమాన్యం చెయ్యాలి.
- కొత్త నీటిని తోడినపుడు, వర్షం పడిన అగ్రికల్చరల్ లైమ్ 40 కేజీలు ఎకరానికి చల్లుకోవాలి.
- చెరువు నీటిలో విబ్రియో బాక్టీరియాలను తరచూ పరీక్షించి పెంపక సమయంలో అస్సలు గ్రీన్ కోలోనీలు లేకుండా యాజమాన్యం చెయ్యాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# మన ఆరోగ్యానికి ఆకుకూరలు



శ్రీమతి కె. లక్ష్మీ ప్రియ, హోమ్ సైంటిస్ట్, కె.వి.కె. యాగంటిపల్లి, కర్నూలు జిల్లా

మన శరీరానికి రక్షణ నిచ్చేవి అన్ని కాలాల్లో చౌకగా దొరికే ఆకుకూరలే. అంతేకాక ఇవి సులభంగా అందుబాటులో లభించాలంటే ఇంటిముందు కాని, వెనుక భాగంలో కాని కొంచెము ఖాళీ స్థలం ఉన్నట్లయితే మనమే అన్ని రకాల ఆకుకూరలు అనగా తోటకూర, పాలకూర, బచ్చలికూర, గోంగూర, మెంతికూర, చుక్కకూర, మునగాకు, చింతచిగురు, పుదీనా, కొత్తిమీర, కరివేపాకు మొదలైన ఎన్నోరకాల ఆకుకూరలను పెంచుకోవచ్చు. ఇలా పెంచుకోవటం వలన కుటుంబానికి అవసరమైన తాజా ఆకుకూలు లభ్యమవుతాయి.

## ఆకుకూరలలో లభ్యమయ్యే పోషక పదార్థాలు :

శరీరానికి అవసరమైన ఎన్నో పోషక పదార్థాలు ఆకుకూరలలో ఎక్కువగా మనకు లభిస్తాయి. వీటిల్లో ముఖ్యంగా రక్తపుష్టికి కావలసిన ఇనుము, ఎముకల గట్టితనానికి అవసరమైన కాల్షియం, కంటి ఆరోగ్యం కోసం విటమిన్ 'ఎ', పళ్ళ చిగుళ్ళ రక్షణకు, రక్తనాళాల గోడలకు బలం ఇవ్వడానికి మరియు దెబ్బలు త్వరగా మానడం మొదలైన వాటికోసం విటమిన్ 'సి', కంటిలో దురదలు, మంటగా ఉండటం, పెదాల మూలలు పగిలి రక్తం కారడం, చర్మంపై మచ్చలు రావడం మొదలైన వాటిని రాకుండా నివారించడం కోసం అవసరమైన 'బి' విటమినులు, రైబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్ ఆకుకూరల్లో ఎక్కువగా లభిస్తాయి. ఆకుకూరలలో పీచుపదార్థం ఎక్కువగా ఉన్నందువలన ఆకుకూరలను రోజు తీసుకోవడం ద్వారా మలబద్ధకం రాకుండా జాగ్రత్త పడవచ్చు.

చంటి పిల్లలకు 6 నెలల నుండే ఆకుకూరల రసం త్రాగించవచ్చు. అందువలన పాలల్లో లోపించే ఇనుము, విటమిన్ 'సి' ఈ ఆకుకూరల రసంలో ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇనుము మరియు విటమిన్ 'సి' లోపం రాకుండా నివారించడానికి ఆకుకూరల రసం లాంటివి త్రాగించవచ్చు.

## ఆహార పోషక మరియు ఆరోగ్య రీత్యా ఆకుకూరల విలువలు :

**తోటకూర :** జీర్ణశక్తికి చాలా మంచిది. శరీరానికి కాంతినిచ్చి, కంటి చూపును మెరుగుపరుస్తుంది.

**పాలకూర :** దగ్గు, ఆస్తమాలను తగ్గించే గుణం ఉంది. జీర్ణశక్తికి మంచి ఔషధంలా పనిచేస్తుంది. దీంట్లో ఉన్న ఖనిజలవణాలు ఎసిడిటిని తగ్గించ గలుగుతాయి. కీళ్ళ నొప్పులు, నరాల బలహీనతలను పోగొడుతుంది. మూత్ర పిండాలలో రాళ్ళ సమస్య ఉన్నట్లయితే దీని వాడకం తగ్గిస్తే మంచిది.

**బచ్చలి ఆకు :** లివర్‌ను కాపాడుతుంది. దీని రసాన్ని పై పూతగా వాడితే శరీరం పేలకుండా ఉంటుంది. చిగుళ్ళ నుంచి రక్తం కారకుండా కాపాడుతుంది.

## వివిధ ఆకుకూరలలో లభ్యమయ్యే పోషక విలువలు

| పోషక విలువలు | తోటకూర | గోంగూర | పాలకూర | చుక్కకూర | బచ్చలిఆకు | మెంతికూర | పుదీన | కరివేపాకు | కొత్తిమీర |
|---|---|---|---|---|---|---|---|---|---|
| శక్తి (కి.కే.) | 45 | 56 | 26 | 15 | 32 | 49 | 48 | 108 | 44 |
| మాంసకృత్తులు (గ్రా.) | 3.0 | 1.7 | 2 | 1.6 | 2.8 | 4.4 | 4.8 | 6.1 | 5.3 |
| క్రొవ్వు (గ్రా.) | 0.5 | 1.1 | 0.7 | 0.3 | 0.4 | 0.9 | 0.6 | - | - |
| బీటాకెరొటిన్ (గ్రా.) | 8,340 | 6,970 | 2,740 | 2,800 | 2,840 | 9,100 | 5,480 | 7110 | 4,800 |
| విటమిన్ 'సి' (మి.గ్రా.) | 99 | 20 | 28 | 12 | 87 | 52 | 27 | 4 | 135 |
| ఐరన్ (మి.గ్రా.) | 3.5 | 2.3 | 1.14 | 0.8 | 10 | 1.93 | 15.6 | 0.9 | 1.42 |
| కాల్షియం (మి.గ్రా.) | 997 | 173 | 73 | 63 | 200 | 395 | 200 | 830 | 184 |
| పీచుపదార్థం (గ్రా.) | 1 | 1 | 0.6 | 0.6 | - | 1.1 | 2 | 6.4 | 1.2 |

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



**గోంగూర :** రక్తహీనత రాకుండా కాపాడుతుంది. కాల్షియం ఎక్కువగా ఉన్నందువలన ఎముకలు, దంతాలకు సంబంధించిన జబ్బులను చాలా వరకు నివారించవచ్చు.

**మెంతికూర :** జీర్ణశక్తికి చాలా మంచిది. మూత్రకోశ వ్యాధులు, కడుపులోని వాయువులు, అజీర్తి, కడుపునొప్పి తగ్గుతాయి. కీళ్ళ నొప్పులు, దగ్గు, వాంతులు, పొట్టలో పురుగులు మొదలైన వాటిని నివారిస్తుంది.

**పుదీన :** నోటి దుర్వాసన, నోటిలోన పుండ్లను తగ్గిస్తుంది. దీనిలోని మింథాల్ తలనొప్పిని, గొంతునొప్పిని తగ్గిస్తుంది.

**చుక్కకూర :** రక్తశుద్ధికి చాలా ఉపయోగపడుతుంది. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. జీర్ణకోశ వ్యాధులు తగ్గుతాయి. మొలలు, గనేరియా వ్యాధిని నివారించగలుగుతుంది.

**కొత్తిమీర :** రక్త వృద్ధికి, జీర్ణశక్తికి మందులా పనిచేస్తుంది. ఆకలిని పెంచుతుంది.

**కరివేపాకు :** కేన్సర్‌ను నివారిస్తుంది. వాతాన్ని తగ్గిస్తుంది మరియు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఎముకల బలహీనత రాకుండా రోజూ ఆహారంలో కరివేపాకు తీసుకుంటే మంచిది.

**పొన్నగంటికూర :** రక్తాన్ని శుభ్రపరుస్తుంది. చర్మ వ్యాధుల్ని తగ్గిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. మూత్ర వ్యాధులను నివారిస్తుంది.

**మునగాకు :** మునగ ఆకులను బాగా నూరి, ఆ ముద్దను కళ్ళపైన పెట్టుకుంటే కళ్ళమంటలు, దురదలు వెంటనే తగ్గిపోతాయి. ఆకులను బాగా నూరి, నీళ్ళలో ఉడకబెట్టి వేడిగా ఉన్నప్పుడే కీళ్ళపై ఉంచి కట్టుకడితే కీళ్ళ నొప్పులు తగ్గుతాయి. గ్యాస్ట్రిక్ ట్రబుల్, కడుపునొప్పి, అల్సర్లను, పేగు పూతలను పోగొడుతుంది.

**క్యాబేజి :** వ్యాధి నిరోధక శక్తిని ఇస్తుంది

## ఆకుకూరల వాడకంలో కొన్ని సూచనలు:

ఆకుకూరలను కోసే ముందు కడగాలి. తగినంత నీరుపోసి, మూతపెట్టి వండాలి లేకపోతే పోషకాల నష్టం జరుగుతుంది. ఆకుకూరలను పప్పులోనో, మాంసంలోనో కలిపి వండుకోవడం వలన ఇనుము, కాల్షియం ఖనిజ లవణాలు శరీరానికి బాగా అందుతాయి. చపాతి, రొట్టె పిండిలలో సన్నగా తరిగిన ఆకుకూరలను కలిపి చేయడం వలన రుచిగా వుంటాయి. రకరకాల ఆకుకూరలతో పొడి, పచ్చడి, వేపుడు, పులుసుకూర, పకోడి, బజ్జి మొదలైన వాటిని చేసుకోవచ్చు. తాజాగా, చౌకగా లభించే కాలంలో వీటిని శుభ్రంగా కడిగి, ఎండబెట్టి, పొడిచేసుకొని డబ్బాలలో నిలువ చేసుకొని ఆకుకూరలు తాజాగా లభించని కాలంలో వాటిని ఉపయోగించుకోవచ్చు. ఇడ్లీ, దోస, వడ పిడిలలో కూడా ఆకుకూరలను సన్నగా తరిగి వేసుకోవచ్చు. పచ్చి ఆకుకూరలను ఉప్పు, నిమ్మరసం చల్లి 'సలాడ్స్' లా తినవచ్చు.

**ఆకుకూరల వాడకం ఎప్పుడు తగ్గించాలి :** విరోచనాలు, మూత్రపిండాలలో రాళ్ళు, కడుపులో పుండ్లు వంటి సమస్యలు ఉన్నప్పుడు ఆకుకూరలు తక్కువగా వాడుకోవాలి.

**ఆకుకూరల వాడకం – అపోహలు :** ఆకుకూరలలో పురుగు, పుట్రా వుంటాయని, తింటే విరేచనాలు అవుతాయని అపోహ. ఆకుకూరలలో కుళ్ళిపోయిన ఆకులు తీసివేసి, శుభ్రంగా కడిగి వాడుకుంటే విటమినులు, ఖనిజ లవణాల నష్టం లేకుండా ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

**మలబద్ధక నివారణకు ఆకుకూరలు :** ఆకుకూరలలో పీచుపదార్థం ఎక్కువ. ఆకుకూరలు రోజూ తీసుకోవడం వలన మలబద్ధకం రాకుండా జాగ్రత్త పడవచ్చు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలలోను, వృద్ధులలోనూ మలబద్ధకం చాలా ఎక్కువగా గమనిస్తుంటాము. ఆకుకూరలను రోజు వాడటం వలన వాటిలోని పీచుపదార్థం మలబద్ధకం రాకుండా కాపాడుతుంది.



"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం

## ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

ANGRAU

### వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం
### ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం, గుంటూరు.

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, లాం, గుంటూరులో వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు మార్కెట్ ధరలను అంచనా వేయుటకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2021 సం. ఏప్రియల్ మరియు మే మాసాలలో వివిధ రకాల పంటల ముందస్తు ధరలు ఏవిధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు ఈ క్రింది విధముగా ఉండవచ్చును.

| క్ర.సం. | పంటలు | అంచనా ధరలు (క్వి/రూ) | అంచనా ధరలు వర్తించు సమయం |
|---|---|---|---|
| 1 | మిరప | 10,000-11,000 (సాధారణ రకాలు)<br>13,000-15,000 (ప్రత్యేక రకాలు) | ఏప్రియల్ - మే 2021 సం. |
| 2 | ప్రత్తి | 5,700-6,000 | |
| 3 | పసుపు | 8,000-8,200 (కొమ్ములు)<br>8,200-8,500 (కాయలు) | |
| 4 | మొక్కజొన్న | 1,500-1,700 | |
| 5 | జొన్న | 1,850-2,100 (తెల్ల రకాలు) | |
| 6 | కంది | 6,200-6,600 | |
| 7 | మినుము | 6,800-7,100 | |
| 8 | పెసర | 6,800-7,200 | |
| 9 | శనగ | 4,800-5,200 | |
| 10 | వేరుశనగ | 5,900-6,250 | |
| 11 | బెల్లం | 3,450-3,700 (నెం. 1 రకము) | |

**ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్‌ని సంప్రదించగలరు.**


డా॥ జి. రఘునాథ రెడ్డి, ప్రధాన పరిశోధకులు

మొబైల్ నెం. 9848321232, 7075463799, 18004198800

ఈ మెయిల్ : amic2018angrau@gmail.com

వెబ్‌సైట్ : www.angrau.ac.in




గమనిక : పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 16 నుండి 28 సం॥ల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా, లేదా ప్రభుత్వ మధ్యంతర జోక్యం /వివిధ పథకాల వల్ల అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏవిధమైన బాధ్యత వహించదు.

# డ్రమ్ము సీడరుతో వరి సాగులో అధిక దిగుబడి

## కచ్చిరి దేవరాయపల్లి గ్రామ రైతులు, అనంతసాగరం మండలం, నెల్లూరు జిల్లా.



సహాయ వ్యవసాయ సంచాలకులు (రె.), ఆత్మకూరు, నెల్లూరు జిల్లా.



శ్రీ. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, అనంతసాగరం మండలం లోని కొత్తపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని కచ్చిరి దేవరాయపల్లి గ్రామ రైతులు అయిన మేము గత నవంబరు మాసంలో NLR-34449, RNR-15048 వరి రకాలను సాగు చేయుట జరిగినది. గత నవంబర్, డిసంబర్ మాసాల్లో కురిసిన నివార్ తుఫానుకి మా గ్రామములలో వరి నారుమడులు పూర్తిగా దెబ్బతిన్న తరువాత, మరల నారుమడులను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో అనంతసాగరం మండలం వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మా గ్రామంలో సరాసరి 780 ఎకరములకు గాను, అందులో 520 ఎకరములు నెల్లూరు మసూరి (NLR-34449), 260 ఎకరములు తెలంగాణ మసూరి (RNR-15048) రకాలు డ్రమ్ సీడరు పద్ధతిలో వరి సాగు చేయుట జరిగినది. మాకు ఎకరానికి 3400 కిలోల నుండి 3825 కిలోలు ధాన్యం దిగుబడి రావడం జరిగినది. దానికిగాను 1 ఎకరాకు 12 కేజీల వరి విత్తనము వాడడము జరిగినది. ఇక్కడ దాదాపుగా 20 కేజీల విత్తనము ఆదా చేయుట జరిగినది, ఒకరి పొలం విత్తడానికి ఇద్దరు వ్యక్తులు సరిపోయినారు. మామూలు పద్ధతిలో 1 ఎకరా నాట్లు వేయడానికి 4500 నుండి 5000 రూపాయల వరకు ఖర్చు అవుతుంది. మాకు డ్రమ్ సీడరుతో ఒక ఎకరానికి విత్తడానికి రూ. 600 మాత్రమే ఖర్చు అవడం జరిగినది. వరుసలలో విత్తడం ద్వారా ఎక్కువ పిలకలు రావడం మరియు పురుగు ఉధృతి తగ్గినది. పురుగు మందులు వాడకం ఈ పద్ధతిలో సాదారణ పద్ధతిలో వాడకం కన్న తగ్గింది. సాధారణంగా నాటిన వరిలో దోమపోటు ఉధృతి చాలా ఎక్కువగా ఉందని గమనించడం జరిగినది. ప్రక్క పొలం కంటే డ్రమ్ సీడరు పద్ధతిలో వేసిన పొలంలో పిలకలు 50-60 రావడం జరిగినది. అలాగే దిగుబడి 3400 కిలోల నుండి 3825 కిలోలు రావడం జరిగినది. సాదారణ వరి సాగు పద్ధతిలో రూ. 30,000 ఖర్చు అయినది. డ్రమ్ సీడరు పద్ధతి ద్వారా రూ. 20,000 ఖర్చు అయినది. దీని ద్వారా మాకు రూ. 10,000 ఆదా అయినది. ఈ పద్ధతి ద్వారా నారుమడి పెంపకము, నాటు ఖర్చు తగ్గించుకోవడమే కాక పంట కాలము తగ్గి పది రోజులు కలిసి వస్తుంది నీరు కూడా తక్కువ పడుతుంది. శ్రమ కూడా తగ్గుతుందని ఆ గ్రామ రైతులు అభిప్రాయపడ్డారు.

ఈ పద్ధతిని చుసిన పక్క గ్రామ రైతులు కొంతమంది ముందుకు వచ్చి తాము కూడా వచ్చే సంవత్సరము ఈ డ్రమ్ సీడరు ద్వారా విత్తే పద్ధతిలో వరి సాగు చేస్తామని చెప్పడం జరిగింది.



“చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి.”



# శనగకు ప్రత్యామ్నాయంగా లాభదాయకంగా జొన్న సాగు

సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్), వింజమూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



నెల్లూరు జిల్లా కొడాపురం మండలంలోని నేకునాంపేట గ్రామములోని నల్ల నేలల్లో సాంప్రదాయంగా శనగ సాగు చేస్తుంటారు. శనగ ధర ఆశాజనకంగా లేకపోవడం వలన రూ. 3,800/- (క్వింటాలుకు) రైతులు కొంత వరకు నష్టపోతున్నారు. ఈ నేలలు ఒక మాదిరి నల్ల నేలలు. దిగుబడి కేవలం 4-5 క్వింటాళ్ళ శనగలు ఎకరాకు మాత్రమే వస్తున్నవి. ఖర్చు మాత్రము ఎకరాకు రూ. 20,000/-లు అవుతున్నది. ఈ విధంగా నష్టపోతున్న రైతులను ప్రత్యామ్నాయ పంటలైన సజ్జ, జొన్న పంటల వైపు మళ్ళించే ప్రయత్నములో భాగంగా 2020 ఖరీఫ్‌లో 50 ఎకరాలలో వర్షాధారంగా సజ్జ సాగు చేసే విధంగా వ్యవసాయశాఖ ప్రోత్సహించగా మంచి ఫలితం వచ్చినది. ఎకరాకు 12-13 క్వింటాళ్ళ దిగుబడి వచ్చినది. ఖర్చు ఎకరాకు రూ. 8,000/-లు మాత్రమే అయినది. క్వింటాలు రూ. 2,150/- వంతు అమ్మగా రూ. 25,800/- గరిష్ఠ ఆదాయం, రూ. 17,800/- నికర ఆదాయం వచ్చినది. ఆ ధీమాతో రైతులు వ్యవసాయశాఖ సలహా మేర 50 ఎకరాలలో ఈ నవంబర్ చివరి వారంలో జొన్న మహీంద్ర 296 హైబ్రిడ్ సాగు చేసి ఎకరాకు 10-12 క్వింటాళ్ళ దిగుబడి సాధించారు. ఈ సంవత్సరం అధిక వర్షాల వలన తక్కువ దిగుబడి వచ్చినది. అయినప్పటికీ శనగతో పోల్చుకుంటే లాభదాయకంగా ఉన్నది. ఈ సంవత్సరం ఆలస్యపు వర్షాల వలన నవంబర్ మాసానికి బదులు డిశంబర్ చివరి వారం మరియు జనవరిలో శనగ వేయుట వలన ఆలస్యమై శనగకు ఎకరాకు కేవలం 3-5 క్వింటాళ్ళు మాత్రమే అగుచున్నది. ఖర్చు మాత్రు రూ. 20,000/-లు ఎకరాకు అయినది. కనుక ఖర్చు ఆదాయము సరిపోయి నికర లాభం అసలు రాలేదు. అదే జొన్న వేసిన వారికి 10 నుంచి 12 క్వింటాళ్ళు ఎకరాకు సాగుబడి ఖర్చు రూ. 12,000/-లు మాత్రమే ఖర్చు అయినది. 12 క్వింటాళ్ళు క్వింటాలు రూ. 1,860/-ల వంతు అమ్మితే రూ. 22,320/- వస్తుంది. అంటే ఖర్చులు పోను ఎకరాకు రూ. 10,320/- లాభం వస్తున్నది. మిషన్ కోత ద్వార ఖర్చు సమయం ఆదా అవుతున్నది. ఇంకా జొన్నచొప్ప పశువులకు మేతగా ఉపయోగపడుతుంది. ఈ విధంగా అంతా శనగ వేయకుండా ఖరీఫ్‌లో సజ్జ వేసిన పొలంలో రబీలో శనగ రబీలో జొన్న వేసిన పొలంలో ఖరీఫ్‌లో జనుము వేసుకొని పంట మార్పిడి పాటిస్తూ ఈ విధంగా సజ్జ-శనగ, శనగ-సజ్జ, జొన్న-జనుము-జొన్న ఇట్లా కొంత పొలంలో ఖరీఫ్‌లో సజ్జ మరియు జనుము లేదా పెసర/మినుము మరియు రబీలో జొన్న, శనగ వేసుకుంటే పొలం ఏగిలిపారడమే కాకుండా శనగలో ఎండు తెగులు తగ్గడమే కాక శనగ ప్రక్కన జొన్న వేస్తు పురుగు ఉధృతి తగ్గి సాగు ఖర్చు తెలుస్తుంది.

## జొన్న సాగు ఖర్చు ఆదాయ పట్టిక (ఎకరాకు)

దుక్కి - రూ. 3,600/-, దిగుబడి: 12 క్వింటాళ్ళు, విత్తనము - రూ. 1,200/-, ధర - రూ. 18,600/- క్వింటాలుకు, ఎరువులు - రూ. 2,700/-, గరిష్టఆదాయం - రూ. 18,600×12= 22,320/-, పురుగు మందులు - రూ. 1,200/-, నికర ఆదాయం - రూ. 22,320-1200=21,120/-, కోత (మిషన్) - రూ. 2,500, మొత్తము - రూ. 11,200/-

మనుషులు కోస్తే కోత, నూర్పిడి ఖర్చు రూ. 5,000/-లు. నికర ఆదాయం రూ. 7,800/-లు మాత్రమే.



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



## టూకీగా...

## నాలెడ్జ్ హబ్‌లుగా ఆర్.బి.కె.లు




వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను సాగు విజ్ఞాన కేంద్రాలు (నాలెడ్జ్ హబ్‌లు)గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, ఆక్వా, పాడి రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక పోకడలను ఎప్పటికప్పుడు రైతులకు చేరువ చేసేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఆర్.బి.కె. ఛానల్' విశేష ఆదరణ పొందుతోంది. ఈ ప్రసారాలన్నీ నేరుగా మొబైల్‌లోనే చూసుకునే వెసులుబాటు కల్పించారు. ఆ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకున్న రైతులకు కూడా ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేస్తున్నారు. ఛానల్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుండటంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు మొబైల్ ద్వారా రైతులు వీక్షించే అవకాశం కలిగింది. ప్రయోగాత్మకంగా వివిధ శాఖల కార్యకలాపాలు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలకు సంబంధించి ప్రసారమవుతున్న వీడియోలకు రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఇప్పటికే 3.50 లక్షల వీక్షకులు గల ఈ ఛానల్‌ను లక్ష మందికి పైగా సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.



## జొన్నలకు సర్కార్ మద్దతు

రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా సాగయ్యే జొన్నలకు కనీస మద్దతు ధర దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఆహార అవసరాల కోసం వాడే జొన్నలకు కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ. 2,650గా కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, పారిశ్రామిక అవసరాలకు వాడే జొన్నలకు కనీస గిట్టుబాటు ధరను క్వింటాల్‌కు రూ. 1,850 గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు. కరోనా నేపథ్యంలో గతేడాది అన్ని వెరైటీలను ఒకే ధరకు కొనుగోలు చేసిన సంగతి విదితమే. క్వింటాల్ రూ. 2,500 చొప్పున 1.11 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. కర్నూలు జిల్లాలో ఇప్పుడిప్పుడే జొన్న మార్కెట్‌లోకి వస్తోంది. పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే జొన్నలు మార్కెట్‌లోకి ఇంకా రాలేదు. మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించని పక్షంలో రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను తెరిచేందుకు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో జొన్నల సాధారణ సాగు విస్తీర్ణం : 2,87,491 ఎకరాలు. ఈ ఏడాది ఇప్పటి వరకు సాగు చేసిన విస్తీర్ణం : 2,63,889 ఎకరాలు. ఈ ఏడాది దిగుబడి అంచనా : 5,05,849 మెట్రిక్ టన్నులు.

## ఖరీఫ్ సాగు పండుగే !



రానున్న ఖరీఫ్ - 2021 సీజన్‌లో అవసరాలకు సరిపడా ఎరువులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పంటల సాగు లక్ష్యం, నేలల్లో పోషకాల లభ్యతను బట్టి ఖరీఫ్ సీజన్‌కు 21.7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా 20.45 లక్షల మెట్రిక్ టన్నులు అందించడానికి కేంద్రం అంగీకరించింది. అయితే రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించేలా వారిని చైతన్యపర్చాలని సూచించింది. ఈ మేరకు ఖరీఫ్-2021 సీజన్‌లక్ష సాగు లక్ష్యం, భూసార పరిస్థితులు, ఎరువుల డిమాండ్ తదితర అంశాలపై ఇటీవల ఢిల్లీలో వివిధ రాష్ట్రాల వ్యవసాయ కమీషన్లు, ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ కార్యదర్శి, ఎరువుల విభాగం ఇన్‌చార్జ్ నీరజ సుదీర్ఘంగా చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో భూసార పరీక్షల ననుసరించి నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం (ఎన్‌పీకే), సూక్ష్మపోషకాల లభ్యత ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్ళలో వినియోగాన్ని బట్టి వివిధ రాష్ట్రాలకు అవసరమైన యూరియా, డీ అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ), మ్యూరేట్ ఆఫ్ పోటాష్ (ఎంవోపీ), సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), కాంప్లెక్స్ ఎరువులపై ఆరా తీశారు.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."



## టూకీగా...

## కందులు... ఆల్‌టైమ్ రికార్డు ధర



రాష్ట్రంలో కందులు పంటకు గిరాకీ ఏర్పడింది. బహిరంగ మార్కెట్‌లో కందులు క్వింటాలుకు రూ.7,200 వరకు ధర లభిస్తోంది. ఇది ఆల్‌టైమ్ రికార్డు కావడం విశేషం రాష్ట్రంలో గతంలో ఎన్నడూ కందులుకు ఇంతటి ధర లభించలేదు. క్వింటా కనీస మద్దతు ధర రూ. ఆరు వేలు కాగా గత నెల వరకు మార్కెట్‌లో రూ.5,000 నుంచి రూ.5,600 మధ్య ధర కొనసాగింది. ఇప్పుడీ ధర అమాంత రూ. ఏడు వేలు దాటింది. వ్యాపారులు పెద్ద ఎత్తున పోటీపడి కొంటున్నారు కందులు కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ. 6 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. నాణ్యతను బట్టి రూ.6,800 నుంచి రూ.7,200 కు పైగా పలుకుతోంది. రాష్ట్రంలో కడప, కర్నూలు, అనంతపురం, ఒంగోలు మార్కెట్లకు పెద్దఎత్తున కందులు వస్తున్నాయి. కనీస మద్దతు ధరలు లభించని వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే. ఆ మేరకు గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయించింది. ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,800 చొప్పున రూ. 394 కోట్ల వెచ్చించి 61,772 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ ద్వారా గతేడాది కొనుగోలు చేసింది.




## బత్తాయికి భలే గిరాకీ..!

ఆంధ్ర బత్తాయి... అంటే ఉత్తరాది రాష్ట్రాల్లో యమ గిరాకీ. మార్కెట్‌కు వస్తోందంటేచాలు ఎగరేసుకుపోతారు. గతేడాది రికార్డు స్థాయిలో దిగుబడులు రాగా, మార్కెట్‌కు వచ్చే సమయంలో కరోనా దెబ్బతీయడంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని కొనుగోలు చేయడంతో బత్తాయి రైతు గట్టెక్కగలిగాడు. బత్తాయి సాగులోనే కాదు... దిగుబడిలో కూడా మన రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో అనంతపురం, విజయనగరం, వైఎస్సార్, ప్రకాశం, తూర్పుగోదావరి నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ఎక్కువగా సాగవుతోంది. మొత్తం విస్తీర్ణంలో సగానికి పైగా రాయలసీమ జిల్లాల్లోనే ఉంది. మనరాష్ట్రంలో సాగయ్యే బత్తాయిలో సగానికి పైగా ఢిల్లీ ఆజాద్‌పూర్ మార్కెట్ ద్వారా ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర 40 వేల నుంచి 50 వేల మధ్య ఉంది. పూర్తి స్థాయిలో పంట మార్కెట్‌కు వచ్చే సమయానికి రూ.60 వేలకు పైగా పలికే అవకాశాలుండడంతో మంచి లాభాలొస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మదర్ డెయిరీ తమ ఖాతాదారులకు పంపిణీ చేసేందుకు రాయలసీమ జిల్లాల నుంచి రోజుకు ఒక లోడు బత్తాయిని కొనుగోలు చేస్తోంది. మొత్తం బత్తాయి కొనుగోలు చేస్తామంటూ ఆ సంస్థ ఇప్పటికే అధికారులతో చర్చలు జరుపుతోంది.

## మత్స్య దిగుబడులు మిలమిల



ఆక్వా రంగ సుస్థిరాభివృద్ధికి గడిచిన రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. కరోనా కష్టకాలంలో కూడా రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయి. దీంతో ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్ రికార్డులను తిరగరాస్తోంది. 54,500 హెక్టార్ల ఉప్పు నీటిలో, 1.44 లక్షల హెక్టార్లు మంచినీటిలో సాగు విస్తీర్ణం కలిగి ఉంది. మరో 48 వేల హెక్టార్లలో ఆక్వా సాగును పెంచేందుకు చర్యలు చేపట్టారు.రాష్ట్ర ప్రభుత్వం గడిచిన రెండేళ్లుగా తీసుకొస్తున్న విప్లవాత్మక విధానాలు ఆక్వారంగ సుస్థిరాభివృద్ధికి దోహదపడుతున్నాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం దిగుబడులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఆక్వా సాగు, దిగుబడిలోనే కాదు.. ఐస్‌లాండ్ (సంప్రదాయ చెరువులు), మెరైన్ ఉత్పత్తుల్లో దేశంలోనే ఏపీ టాప్‌లో కొనసాగుతోంది. దేశవ్యాప్త చేపల ఉత్పత్తిలో 29 శాతం, రొయ్యల ఉత్పత్తిలో 68 శాతం ఇక్కడ నుంచే జరుగుతోంది. మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల్లో 40 శాతం వాటా ఏపీదే. 2019-20లో 18,860 కోట్ల విలువైన మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేయగలిగారు. గడిచిన రెండేళ్ళుగా నీటికొరత లేకుండా చేయడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు సీఎం కాగానే విద్యుత్ టారీఫ్ తగ్గించి యూనిట్ రూ.1.50 లకే అందించడం ఆక్వాసాగుకు ఊతమిచ్చింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా గడిచిన ఏడాదిగా నిర్వహిస్తున్న మత్స్య సాగుబడులు సత్ఫలితాలనిచ్చాయి. శాస్త్రవేత్తలు, నిపుణులు ఎప్పటికప్పుడు ఇచ్చిన మెళకువలు నాణ్యమైన దిగుబడుల సాధనకు దోహదపడ్డాయి.





# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు



## ఆహార పంటలు

1. స్వామి రంగా రెడ్డి, ఫోన్: 9505587149, తాడిపత్రి (గ్రా), తాడిపత్రి (మం), అనంతపురం (జిల్లా)

**ప్ర. కదిరి లేపాక్షి 1812 అనే వేరుశనగ రకం కాల పరిమితి,విత్తన మోతాదు మరియు విత్తన ఎక్కడ లభిస్తుందో తెలుపండి?**

జ. కదిరి లేపాక్షి అను వేరుశనగ రకం ఖరీఫ్ లో 112 రోజులు,రబీలో 120-125 రోజులు.విత్తన మోతాదు 30-32 కిలోలుఎకరానికి వేసుకోవాలి.కదిరి పరిశోధన స్థానం-అనంతపురం జిల్లాలో విత్తనం లభిస్తుంది. సంప్రదించవలసిన శాస్త్రవేత్త. నాయక్ 9989625217

2. వెంకట రావు, ఫోన్: 9094489289, పొన్నూరు (గ్రా), పొన్నూరు (మం), గుంటూరు (జిల్లా)

**ప్ర. 40 రోజుల మొక్కజొన్న పంటలో కలుపు ఎక్కువగా ఉంది నివారణ తెలుపండి?**

జ. మొక్కజొన్న పంట కలుపు నివారణకు టెంబో ట్రయన్ (లాడిస్) ఎకరానికి 115 మి.లీ పిచికారీ చేసుకోవాలి.

3. వెంకట నారాయణ, ఫోన్: 9491948930, పెద్దరంగాపురం (గ్రా), పులివెందుల(మం), కడప (జిల్లా)

**ప్ర. తెల్ల కుసుమ పంటలో పేనుబంక ఉంది నివారణ తెలుపండి?**

జ. తెల్ల కుసుమ పంటలో పేనుబంక నివారణకు ఎకరానికి ఎసిటామిప్రిడ్ 40 గ్రాములు పిచికారీ చేసుకోవాలి.

4. సాయి నాథ్, ఫోన్: 6301256662, పుట్టపర్తి (గ్రా), పుట్టపర్తి (మం), అనంతపురం (జిల్లా)

**ప్ర. రాగి పంటలో పురుగు ఉంది మరియు ఆకులు ముడుచుకు పోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. రాగి పంటలో ఆకు ముడత మరియు పొగాకు లద్దె పురుగు ఆశించినది.నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/ లీటరు (ఎకరానికి 500మి.లీ) లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు/లీటరు (ఎకరానికి 300 గ్రాములు) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

5. చంద్ర, ఫోన్: 7997480721, బొజ్జవారిపల్లె (గ్రా), రైల్వే కోడూరు (మం), కడప (జిల్లా)

**ప్ర. ప్రొద్దుతిరుగుడు పంటలో పురుగు ఉంది నివారణ తెలుపండి?**

జ. ప్రొద్దుతిరుగుడు పంటలో పొగాకు లద్దె పురుగు ఆశించినది.నివారణకు నోవాల్యురాన్ 1 మి.లీ/లీటరు (ఎకరానికి 200 మి.లీ) లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు/లీటరు (ఎకరానికి 300 గ్రాములు) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

## ఉద్యాన పంటలు

6. లక్ష్మి నారాయణ, ఫోన్: 95503138800, ఎమ్.ఎస్. పల్లి (గ్రా), కారచిలి (మం), శ్రీకాకుళం (జిల్లా)

**ప్ర. పుచ్చ తోటలో ఆకులు ముడుచుకు పోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. పుచ్చ తోటలో రసం పీల్చు పురుగులు ఆశించినవి. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు/లీటరు (ఎకరానికి 300 గ్రాములు) నీటికి లేదా డై మిథోయేట్ 2 మి.లీ/ లీటరు (ఎకరానికి 400 మి.లీ)నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

7. వైథీ, ఫోన్: 9959279962, కలికిరి (గ్రా), కలికిరి (మం), చిత్తూరు (జిల్లా)

**ప్ర. టమాటా పంటలో కాయలలో పురుగు ఉంది నివారణ తెలుపండి?**

జ. టమాటా పంటలో కాయ తొలుచు పురుగు ఆశించినది. నివారణకు ఫ్లూ బెండిమైడ్ 0.3 మి.లీ/ లీటరు (ఎకరానికి 60 మి.లీ) లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు/ లీటరు (ఎకరానికి 80 గ్రాములు) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

8. అరుణ్, ఫోన్: 6304374068, కొండవాడు (గ్రా), గుమ్మలక్ష్మీ పురం (మం), విజయనగరం (జిల్లా)

**ప్ర. జీడి మామిడి తోటలో నామాల పురుగు నివారణ తెలుపండి?**

జ. జీడి మామిడి తోటలో నామాల పురుగు నివారణకు క్వినాల్ ఫాస్ 1.5 మి.లీ/లీటరు నీటికి లేదా లామ్డా సైహలోత్రిన్ 0.6 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

9. కార్తీక్, ఫోన్: 9989851840, కోర్తి కోట (గ్రా), తనకల్లు (మం), అనంతపురం (జిల్లా)

**ప్ర. అరటి తోట లో ఆకులపై మచ్చలు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. అరటి తోటలో సిగటోక ఆకు మచ్చ తెగులు ఆశించినది. నివారణకు తెగులు సోకిన ఆకులను తీసి దూరంగా వేసి తగలబెట్టాలి. హెక్సాకొనజోల్ 2 మి.లీ ం శాండోవిట్ 0.5 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మరలా 5 రోజుల తర్వాత ఇదే విధముగా పిచికారీ చేసుకోవాలి. అదే విధముగా ఒక్కొక్క మొక్కకు 80 గ్రాముల పొటాష్ ఎరువు వేసుకోవాలి.

10. నాగార్జున రెడ్డి, ఫోన్: 9010215336, పుట్లూరు (గ్రా), పుట్లూరు (మం), అనంతపురం (జిల్లా)

**ప్ర. బెండ పంట వేసి 40 రోజులు అవుతుంది పెరుగుదల మరియు దిగుబడికి పరిష్కారం తెలుపండి?**

జ. బెండ పంటలో దిగుబడి పెరుగుదలకు సిఫారసు చేసిన ఎరువులను 3 దఫాలుగా వేసుకోవాలి. ప్రస్తుతం ఎకరానికి (13-0-45) మల్టి-కె 2 కిలోలు 10 రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేసుకోవాలి.

## పశుసంవర్ధక రంగం

11. జింకల నరసింహులు, ఫోన్: 8374240042, అల్లపల్లి (గ్రా), ఓడీసీ (మం), అనంతపురం (జిల్లా)

**ప్ర. పెద్ద మేకలు నాలుగు రోజుల నుంచి దగ్గుతున్నాయి పరిష్కారం తెలుపండి?**

జ. 1. లిక్విడ్ ఎన్రాక్స్ డీ 200 మి.లీ ఉదయం 2 మి.లీ మరియు సాయంత్రం 2 మి.లీను మేకలకు పట్టించాలి. 2.లిక్విడ్ బ్రోటోన్ 500 మి.లీ ఉదయం 2 మి.లీ సాయంత్రం 2 మి.లీను మేకలకు పట్టించాలి.అలానే దగ్గరలో ఉన్న పశువైద్యుల్ని సంప్రదించి జ్వరం చూపించి తగిన వైద్యం చేయించుకోవాలి.

12. కృష్ణా రెడ్డి, ఫోన్: 9494830113, ఆవు రెడ్డి కండ్రిగ (గ్రా), వెదురు కుప్పం (మం), చిత్తూరు (జిల్లా)

**ప్ర. ఆవు సరిగ్గా మేత మేయడం లేదు మరియు పెరుదల తగ్గింది పరిష్కారం తెలుపండి?**

జ. 1. మొదట Bolus జలగ మందునువేయవలెను. Fentas 3 గ్రాములు రాత్రి పూట ఆవుకు వేయవలెను. 2. Agromin forte - మినరల్ మిక్చర్‌ను అగ్గిపెట్టె అంత మందును దాణాలో కలిపి ఉదయం, సాయంత్రం తినిపించవలెను. 3. లిక్విడ్ బ్రోటన్ 1 లీటరు మందును తీసుకొని రోజుకి 80 మి.లీ చొప్పున 6 రోజుల పాటు వేయాలి.

## మత్స్యరంగం

13. రమణా రెడ్డి, ఫోన్: 9440670296, అరవకూరు (గ్రా), కూడేరు (మం), అనంతపురం (జిల్లా)

**ప్ర. చెరువులో చేప పిల్లలు వదిలాము పెరుగుదల లేదు ఎటువంటి ఆహారం ఇవ్వాలో తెలుపండి?**

జ. చేపలలో ఎదుగుదల కొరకు 70 కిలోల నూనె తీసిన తౌడు మరియు 35 కిలోల వేరుశనగ చెక్క లేదా 35 కిలోల ప్రత్తి చెక్కనుఆహారంగా ఇవాలి.ప్రతి రోజు ఇచ్చే మేతలో కిలో మేతకు 5 మి.లీ ప్రోబయోటిక్ కలిపి ఇవ్వటం ద్వారా చేపలలో ఎదుగుదల బాగుంటుంది.

14. రవి రాజ్ కుమార్, ఫోన్: 7993563913, వేమపాడు (గ్రా), ద్వారకా తిరుముల (మం), పశ్చిమ గోదావరి (జిల్లా)

**ప్ర. చేపల చెరువులో కలుపు చేపలు నివారణ తెలుపండి?**

జ. చేపలను పట్టి వేసిన తర్వాత మహువా నూనె చెక్క 5 కిలోలు లేదా టీ సీడ్స్ చెక్క 5 కిలోలు ఎకరానికి వేయాలి.వేసిన తర్వాత ఆ నీటిని 3 రోజులు నిల్వ కట్టి ఆ నీటిని తీసి వేసి తర్వాత కొత్తగా నీరు పెట్టి కల్చర్ చేపలను వదులుకోవాలి.

15. దిలీప్, ఫోన్: 7989655812, అల్లూరు (గ్రా), కొత్తపట్నం (మం), ప్రకాశం (జిల్లా)

**ప్ర. రొయ్యలు చెరువులో అమ్మోనియా ఎక్కువగా ఉంది నివారణ తెలుపండి?**

జ. చెరువులో అమ్మోనియా నివారణకు ఎకరానికి జియోలైట్ 20 కిలోలు మరియు యుక్కా 500 గ్రాములు చల్లుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154

1. రమణ, రామన్న పల్లె (గ్రా.), చెన్నూరు (మం.), కడప (జిల్లా). ఫోన్ : 8500758952



**ప్ర. జామలో పిండి నల్లి ఉంది నివారణ తెలుపండి ?**

జ. జామలో పిండి నల్లి, గజ్జి తెగులు నివారణకు ఆశించినది ఏసిఫేట్ 1.5 గ్రాములు /లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. జామలో గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు/లిటర్ నీటికీ కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా నివరించుకోవచ్చును.



2. ఆనందయ్య, ఎం పైపల్లి ((గ్రా.), ఐరాల ((గ్రా.), చిత్తూరు జిల్లా. ఫోన్: 7382095506

**ప్ర. వరి పంటలో కంకులు తెల్లగా అయ్యి పోయి పట్టుకుని లాగా గానే సులభంగా వచ్చేస్తుంది నివారణ తెలుపండి?**

జ. వరిలో కాండం తొలుచు పురుగు ఆశించినది. నివారణకు క్లోరాంట్రినిలిప్రోల్-ఎకరానికి-60మిల్లిలీటర్లు /200 లీటర్లు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



3. మణిపాల్ రెడ్డి, రెడ్డి గూడెం ((గ్రా.), రెడ్డి గూడెం (మం.), కృష్ణా జిల్లా. ఫోన్ : 9963228387

**ప్ర. మామిడి లో కాయల పై నల్లటి మచ్చలు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. మామిడి కాయల పై నల్లటి మచ్చల నివారణకు గాను ఎసిఫేట్ 1 గ్రాము లీటర్ నీటికి లేదా ఇమిడా క్లోప్రిడ్ 0.3 మి.ల్లి లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



4. దుర్గారావు, కొమ్మగుడెం ((గ్రా.), తాడేపల్లి గూడెం (మం.), పశ్చిమ గోదావరి జిల్లా. ఫోన్ : 9963779440

**ప్ర. ఆవాలు పంటలో ఆకులును గూడుగా చేస్తూ పురుగు తింటుంది నివారణ తెలుపండి?**

జ. ఆవాలు పంటలో ఆకు గూడు పురుగు ఉంది. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.ల్లి ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుచేసుకోవాలి. లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.ల్లి ఒక లీటర్ నీటికీ కలిపి పిచికారీ చేసుకోవాలి .



5. సాయినాథ్ రెడ్డి, కృష్టిపాడు ((గ్రా.), దోర్నిపాడు (మం.), కర్నూలు జిల్లా. ఫోన్ : 7893516332

**ప్ర. మినుములో లద్దె పురుగు ఆకులను రంద్రాలు చేసి తింటుంది నివారణ తెలుపండి ?**

జ. మినుములో లద్దె పురుగు ఆశించింది నివారణకు థైయోడి కార్బ్ 250 గ్రా లేదా నోవాల్యురాన్ 1మి.లీ /లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

6. వెంకటేశ్వర్లు, చాకిచేర్ల (గ్రా.), ఉలవపాడు (మం.), ప్రకాశం (జిల్లా).
ఫోన్ : 8121827097



ప్ర. దూడ నీరసంగా ఉంటుంది ఎటువంటి మందులు వాడలో తెలపండి?

జ. 1) RL - 500 ml
2) Ac - vct - 500 mg
3) Panacur - 250 mg



7. రైతు పేరు:శ్రీనివాసరావు, పనసపాడు (గ్రా.), సామర్లకోట (మం.), తూ.గో.జిల్లా
ఫోన్ : 9603823635

ప్ర. కనకంబరంలో మొక్కలు వదిలిపోతున్నాయి నివారణ తెలుపండి ?

జ. కనకంబరం లో వడలు తెగులు ఉంది. నివారణకు రిడొమిల్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పాదుల చుట్టూ వేర్లు బాగా తడిచేల పోయాలి.

8. కేశవులు, అనిగానూరు (గ్రా.), రామకుప్పం (మం.), చిత్తూరు జిల్లా. ఫోన్: 9100707883



ప్ర. క్యాబేజీ లో ఆకులను పురుగు తినివేస్తుంది నివారణ తెలుపండి ?

జ. క్యాబేజీ లో రెక్కల పురుగు నివారణకు: నోవాల్యూరాన్ 200 మి.లీ/ ఎకరా (లేదా) స్పైనోసాడ్ 75 మి.లీ /ఎకరనికి పిచికారీ చెయ్యాలి.



9. B. బుజ్జిదొర, T. చల్లపల్లి (గ్రా.), ఉప్పలగుప్తం (మం.), తూర్పుగోదావరి జిల్లా.
ఫోన్ : 9849494728

ప్ర. కొబ్బరి మొక్కలు నల్లగా అయిపోతున్నాయి నివారణ తెలుపండి?

జ. ఇది రుగోస్ తెల్లదోమ ఆశించిన తరువాత ఇటువంటి లక్షణాలు వస్తాయి. దీనికి మంగు పోవడానికి నీటిని అధిక పీడనంతో పిచికారీ చేసుకోవాలి లేదా గంజిని నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవచ్చు. తరువాత వేప నూనె 10,000 ppm అయితే 1 ml, 3000 ppm అయితే 3 ml,1500 ppm అయితే 5 ml, చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

10. వెంకటేశ్వర్లు, చెన్నయపాలెం (గ్రా.), మాచవరం (మం.), గుంటూరు జిల్లా.
ఫోన్ : 9676308789



ప్ర. పొద్దు తిరుగుడు మొక్కలు వదలి పోతున్నాయి నివారణా తెలుపండి?

జ. పొద్దు తిరుగుడు లో వడలు తెగులు నివారణకు గాను కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజమ్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

**1. 30 రోజుల మొక్కజొన్న పంటలో పురుగు ఆకులను కత్తిరిస్తుంది. నివారణ తెలుపండి?**

జ. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించినది. నివారణకు విషపు ఎరను వాడవలెను.ఎరకు 15 కిలోల తవుడు, 1 కిలో బెల్లం, 100 గ్రాముల థయోడికార్బ్ కలిపి ఒక రోజు పులియబెట్టి చిన్న చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళలో పైరుపై వేసుకోవాలి.

**2. ఉల్లి పంట లో వేర్లు కుళ్ళి పోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. ఉల్లి పంటలో వేరుకుళ్ళు తెగులు ఆశించినది. నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**3. కంది పంటలో కాయలలో పురుగు ఉంది నివారణ తెలుపండి?**

జ. కంది పంటలో కాయ తొలుచు పురుగు ఆశించినది. నివారణకు థయోడికార్బ్ 1 గ్రాము/లీటరు (ఎకరానికి 200 గ్రాములు) లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**4. మినుము (PU-31) పంట వేసి 28 రోజులు అవుతుంది. కలుపు తోటకూర, ఊద, చిప్పెర, కామంచి కాయల చెట్లు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. మినుము పంటలో కలుపు నివారణకు ఎకరానికి ఫెనాక్స్ ప్రాప్ ఇథైల్ 250 మి.లీ లేదా క్విజలో పాప్ ఇథైల్ 400 మి.లీలలో ఏదో ఒకదానిని పిచికారీ చేసుకోవాలి.

**5. వరి పంటలో దోమ ఉంది నివారణ తెలుపండి?**

జ. వరి పంటలో సుడి దోమ ఆశించినది. నివారణకు డైనో టెఫ్యూరాన్ 0.4 గ్రాములు/లీటరు (ఎకరానికి 80 గ్రా.) లేదా పైమెట్రోజోన్ 0.6 గ్రాములు/లీటరు (ఎకరానికి 120 గ్రా.) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**6. మునగ పంట వేసి 9 నెలలు కాయలపై బంక ఏర్పడి కాయలు పొడై పోతున్నాయి నివారణ తెలుపండి?**

జ. మునగ చెట్లకు కాయ తొలుచు ఈగ ఆశించినది.నివారణకు ఫాసలోన్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**7. మినుము పంటలో ఆకులు గుబురుగా మారి ముడుచుకు పోతున్నాయి మరియు ఆకులపై బొబ్బరలా ఉంది నివారణ తెలుపండి?**

జ. మినుము పంటలో సీతాఫలం తెగులు ఆశించినది. ఇది రసం పీల్చు పురుగుల వలన వ్యాపిస్తుంది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు/లీటరు (ఎకరానికి 300 గ్రాములు) లేదా డై మిథోయేట్ 2 మి.లీ/ లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**8. బూడిద గుమ్మడి పంటలో పిందెలు రాలిపోతున్నాయి పరిష్కారం తెలుపండి?**

జ. బూడిద గుమ్మడి పంటలో ఆడ పుష్పాలు ఫలదీకరణం చెందక పోవటం వలన పిందెలు రాలిపోతాయి.కావున మగ పువ్వులను ఆడ పువ్వులపై చేతి తో అద్దవలెను.

**9. మామిడి తోటలో ఆకులపై మచ్చలు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. మామిడి పంటలో పక్షి కన్ను (ఆంత్రాక్నోస్) తెగులు ఆశించినది. నివారణకు ఎండు కొమ్మలను తీసి వేయాలి. కార్బండిజం 1 గ్రాము/లీటరు (ఎకరానికి 200 గ్రాములు) లేదా క్లోరథలోనిల్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పూత సమయంలో 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

**10. వేరుశనగ పంట వేసి 25 రోజులు. కొన్ని మొక్కలు పీక భాగం వద్ద కుళ్ళినట్లు ఉండి చనిపోతున్నాయి.నివారణ తెలుపండి?**

జ. వేరుశనగ పంటలో శిలీంద్రం ఆశించటం వలన మెడ భాగం వద్ద కుళ్ళి క్రమేపి మొక్కలు చనిపోతాయి. నివారణకు క్లోరథలోనిల్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**11. మల్లె తోటలో మొగ్గలలో పురుగు ఉంటుంది నివారణ తెలుపండి?**

జ. మల్లె తోటలో మొగ్గ తొలుచు పురుగు ఆశించినది.నివారణకు స్పైనోశాడ్ 0.5 మి.లీ, అజాడిరక్టిన్ 1500 PPM 5 మి.లీ/ లీటరు (ఎకరానికి స్పైనోశాడ్ 100 మి.లీ, అజాడిరక్టిన్ 1500 PPM ఒక లీటరు) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**12. దొండ పందిరిలో ఆకులపై సన్నని తెల్లని దారులు ఉన్నాయి నివారణ తెలుపండి?**

జ. దొండ పంటలో పాము పొడతెగులు ఆశించినది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ/లీటరు (ఎకరానికి 400 మి.లీ) నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

TOLL FREE NUMBER 155251

రైతు భరోసా కేంద్రము

వ్యవసాయ మరియు అనుబంధ శాఖల

సమీకృత రైతు సమాచార కేంద్రము

గన్నవరం

# రైతుల స్పందన

నేను వేసిన మిరపతోటలో కాండం, కాయ కుళ్ళు తెగులు సోకింది. దీనికై గన్నవరంలోని రైతు సమీకృత సమాచార కేంద్రాన్ని సంప్రదిస్తే ఎకరానికి 200 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ అనే మందుని పిచికారి చేయమని సలహా ఇవ్వగా నేను ఆచరిస్తే వారం రోజుల్లోనే నాకు మంచి ఫలితం వచ్చింది. వారికి నా ధన్యవాదాలు.

జి. చెంచయ్య నాయుడు
9618261120
పటమట వెంకటాపురం
దొనకొండ మం.,
ప్రకాశం జిల్లా

ఎ.జగ్గయ్యనాయుడు
9550754104
పాండ్రంగి గ్రా.,
జామి మం.,
విజయనగరం జిల్లా

నా వరి చేనులో మెడవిరుపు తెగులు కనిపిస్తే సమాచార కేంద్రం వారిని సంప్రదించాను. వారు ఎకరాకు ఇప్రోబెన్‌ఫాస్ అనే మందును 30 మి.లీ. చొప్పున తర్వాత ఎకరాకు 50 మి.లీ.ల కసుగమైసిన్ అనే మందును వారం తేడాతో పిచికారి చేయమని సిఫార్సు చేయగా మంచి ఫలితాల నిచ్చింది. నాకు చాలా సంతోషం ఇచ్చింది.

నా టమోటా పంటను పొగాకు లద్దె పురుగు నాశనం చేయడం వలన గన్నవరం సమాచార కేంద్రాన్ని సంప్రదిస్తే క్లోరాంట్రానిలిప్రోల్ ఎకరాకు 60 మి.లీ. మందును సిఫార్సు చేయగా ఆచరించాను. నాకు మంచి ఫలితాలొచ్చాయి. వారి పనితీరు బాగుంది.

మహమ్మద్
7989383836
అమలాపల్లి గ్రా.,
గుర్రంకొండ మం.,
చిత్తూరు జిల్లా

వై. వరహాలు
9666144594
దొనకొండ గ్రా.,
తుని మం.,
తూర్పు గోదావరి జిల్లా

నా మిరప తోటకి తామర పురుగులు మరియు ఆకుమచ్చ తెగులు ఆశించగా రైతు సమాచార కేంద్రానికి ఫోన్ చేస్తే ఎకరానికి 400 మి.లీ.ల ఫిప్రోనిల్, 200 మి.లీ.ల ప్రొపికొనజోల్ అనే మందులు కలిపి పిచికారి చేయమని సిఫార్సు చేశారు. అనతికాలంలోనే ఈ పురుగు ఉధృతి తగ్గడమే కాకుండా ఆకుమచ్చ తెగులు నియంత్రణలోకి వచ్చింది. ఈ సమాచార కేంద్రం వారికి నా కృతజ్ఞతలు.

నా పసుపు తోటలో ఆకుమచ్చ తెగులు లక్షణాలు కనిపించగా రైతు సమాచార కేంద్రాన్ని సంప్రదించాను. ఎకరాకు 30 గ్రా. కేప్టాన్ మరియు హెక్సాకొనజోల్ అనే మందును పిచికారి చేయమని సిఫార్సు చేశారు. వారం రోజుల్లోనే నాకు మంచి ఫలితం వచ్చింది. వారికి నా ధన్యవాదాలు.

వెంగళ్‌రావు
994998287
జంపని గ్రా.,
వేమూరు మం.,
గుంటూరు జిల్లా

రాంబాబు
9705640968
కంతేపల్లి గ్రా.,
సత్తెనపల్లి మం.,
గుంటూరు జిల్లా

నేను వేసిన జొన్నలో ఆకుమచ్చ తెగులు ఆశించగా గన్నవరం రైతుసమాచార కేంద్రాన్ని సంప్రదించాను. వారు ఎకరాకు 400 గ్రా. డైథేన్-ఎం-45 అనే మందుని పిచికారి చేయమని సిఫార్సుచేయగా నేను ఆచరించాను. ఆరు రోజుల్లోనే ఫలితం వచ్చింది. వారి పనితీరు బాగుంది.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



# ఉత్తమ సేవలందిస్తున్న ఆర్‌బికె సిబ్బంది



**ఎ. శ్రీనివాస్**
బొద్దూరు గ్రా., సంతకవిటి మం.,
శ్రీకాకుళం జిల్లా



**జి. తారకరామారావు**
కొత్తపేట-1, వేటపాలెం మం.,
ప్రకాశం జిల్లా



**ఎం. నవీన్ తేజ**
తిమ్మనాయుడిపేట గ్రా.,
కొలిమిగుండ్ల మం., కర్నూలు జిల్లా



**బి. అహల్య**
గండిగుంట-1, ఉయ్యూరు మం.,
కృష్ణా జిల్లా



**ఎస్. నరేంద్ర**
అయ్యవారి పల్లి గ్రా., సీతారామపురం
మం., నెల్లూరు జిల్లా



**ఎ. రాచయ్య**
వైఎన్ పాలెం గ్రా., టి. సుండుపల్లి మం.,
వైఎస్ఆర్ కడప జిల్లా



**జె. పుష్ప**
తగరంపూడి గ్రా., అనకాపల్లి మం.,
విశాఖపట్నం జిల్లా



**పి. సత్యనారాయణ**
వేళ్ళ గ్రా., రామచంద్రపురం మం.,
తూర్పుగోదావరి జిల్లా



**కె. రెడ్డి కుమారి**
రెడ్డివారిపల్లి-2 గ్రా., నిమ్మనాపల్లి మం.,
చిత్తూరు జిల్లా



**బి. నరేంద్ర**
చెరుకుపల్లి-1 గ్రా., చెరుకుపల్లి మం.,
గుంటూరు జిల్లా



**బి. ఉషారాణి**
లోచర్ల గ్రా., కొత్తచెరువు మం.,
అనంతపురం జిల్లా



**పి. ప్రియాంక**
చల్లవానితోట గ్రా., పూసపాటిరేగ మం.,
విజయనగరం జిల్లా



**టి. సుధీర్ బాబు**
కవులూరు గ్రా., నల్లజర్ల మం.,
పశ్చిమగోదావరి జిల్లా




రసాయన ఎరువుల్ని, పురుగు మందుల వాడకాన్ని తగ్గిద్దాం

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

భూసారాన్ని పరిరక్షించుకుందాం

మన ఆరోగ్యాన్ని పెంపొందించుకుందాం